

డీఆర్ఎంగా సుధేష్ణ సేన్ బాధ్యతల స్వీకారం 6



- అటెండెన్స్ మార్కింగ్ చేయని సచివాలయాల ఉద్యోగులు
- 3 జిల్లాల ఉద్యోగులది ఇదే తీరు
- అదేమని ప్రశ్నిస్తే కుంటి సాకులు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట ఆదేశాలు

హాజరు ఉంటేనే.. జీతాలు



గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో ఇంకా కొంత మందిలో నిర్లక్ష్య ధోరణి పోవడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ వ్యవస్థలో నియమితులైన ఉద్యోగులు తాము ప్రత్యేకమన్న రీతిలో వ్యవహరించే వారు. వివిద ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల ఆదేశాలు ఖాతరు చేసే వాళ్లు కాదు. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నది. సచివాలయాల ఉద్యోగులంతా హ్యూమన్ రిసోర్సు మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్/యాప్‌లో లాగిన్ అయి తప్పక ఇన్ వార్డు, అవుట్‌వార్డు హాజరుని మార్కింగ్ చేయాలని పదేపదే ప్రభుత్వం ఆదేశిస్తున్నా కొందరిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఏవేవో కుంటిసాకులు చెబుతూ హాజరు వేయకుండా జీతాలు డ్రా చేస్తున్నారు. దీని వలన సర్వీసు డెలివరీ, ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించడంలో ఇబ్బందులు తలెత్తు తుండటంతో ఇక నుంచి ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని మూడు జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

సచివాలయాల వ్యవస్థ ఏర్పాటైన తర్వాత 2021వ సంవత్సరం ఫిబ్రవరి నాల్గో తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్క ఉద్యోగి బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పక రోజుకు రెండు సార్లు వేయాలని ఆదేశించింది. ఆ తర్వాత ప్రభుత్వం హెచ్‌ఆర్‌ఎంఎస్ యాప్‌ని ప్రతి ఒక్క ఉద్యోగికి తీసుకొచ్చింది. ఇది జియో కో-ఆర్డినేట్స్ ఆధారంగా అటెండెన్స్‌ని మార్కింగ్ చేస్తుంది. ఉద్యోగి సంబంధిత సచివాలయానికి 300 మీటర్ల లోపు ఉంటే అటెండెన్స్ మార్కింగ్ అవుతుంది. ప్రతి ఒక్క ఉద్యోగికి జాబ్ చార్ట్ ప్రకారం ఇన్‌వార్డు, అవుట్‌వార్డు టైమింగ్స్ ఉన్నాయి. అయినప్పటికి కొందరు నిర్లక్ష్య ధోరణితో ఉంటూ సమయానికి వచ్చి అటెండెన్స్‌ని మార్కింగ్ చేయకుండా లేటుగా వస్తున్నారు. కొందరైతే సాయంత్రం వచ్చి ఇన్ వార్డు, అవుట్‌వార్డు రెండూ ఒకే సారి నిమిషాల వ్యవధిలో మార్కింగ్ చేస్తున్నారు. అదేమంటే తాము ఫీల్డ్‌లో ఉన్నామని, ఫలాన అధికారి పని చెప్పారని, పింఛన్ల పంపిణీ ఆలస్యమైందని వంటి ఏవేవో కారణాలు చెబుతున్నారు.

> గుంటూరు జిల్లాలో 568 గ్రామ/వార్డు సచివాలయాలుండగా 4806 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో 3696 మంది హెచ్‌ఆర్ ఎంఎస్ పోర్టల్‌లో అటెండెన్స్‌ని సక్రమంగా మార్కిం గ్ చేస్తున్నారు. 1109(23 శాతం) మంది అటెండెన్స్‌ని మార్క్ చేయడం లేదు. బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలుంటే 4,259 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో 3182 మంది హాజరు వేస్తు న్నారు. 1077 (25 శాతం) మంది పోర్టల్/యాప్‌లో హాజరు మార్క్ చేయడం లేదని తేలింది. పల్నాడు జిల్లాలో 538 సచివాలయంటే 4456 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీళ్లలో 3536 మంది మాత్రమే నిత్యం హాజరుని మార్కింగ్ చేస్తున్నారు. 920(21 శాతం) మంది హాజరుకు దూరంగా ఉంటున్నారు.

ఈ నేపథ్యంలో కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)లను సక్రమంగా పర్యవేక్షించ లేని పరిస్థితి ఉత్పన్నమవుతున్నది. ముఖ్యంగా ప్రజలకు సర్వీసు డెలివరీ సకాలంలో చేయ లేని పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ కారణాలతో హెచ్‌ఆర్‌ఎం పోర్టల్‌లో అటెండెన్స్ వేస్తేనే జీతాలు విడుదల చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో మూడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి తరచుగా సమీక్షించాలని సూచించింది. అలానే గుంటూరు జిల్లాలో 86, బాపట్లలో 56, పల్నాడులో ఏడుగురు సచివాలయాల ఉద్యోగులను డిప్యూటేషన్‌పై వేరే పనులకు వినియోగిస్తున్నారు. తక్షణమే వాటన్నింటిని రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏదైనా విపత్తులు సంభవించినప్పుడు మాత్ర మే అది కూడా ఏడు రోజులకు మించి డిప్యూ టేషన్ చేయొద్దని స్పష్టం చేసింది. సీఆర్‌డీఏకి చేసిన డిప్యూటేషన్లు మినహా మిగిలిన వన్నింటిని రద్దు చేయాల్సిందేనని, సిబ్బంది సచివాలయాల నుంచే విధులు నిర్వహించా లని తేల్చి చెప్పింది.

రబీ ధాన్యం.. సేకరణకు సిద్ధం!



- నేటి నుంచి తెరుచుకోనున్న కొనుగోలు కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- బాపట్ల జిల్లాలో రబీకి 10,000 టన్నుల నుంచి 30,000 వరకు పెంపు
- పల్నాడు జిల్లాలో 10,000 టన్నుల సేకరణకు అనుమతి
- లేట్ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాని స్పష్టత

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రబీ ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 42 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లను ప్రారంభించనున్నారు. బాపట్ల జిల్లాకు సంబంధించి రబీ సీజన్‌లో 62,000 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి ఉంటుందనేది అంచనాగా ఉంది. మూడు వారాల క్రితం రబీ సీజన్‌లో 40,000 టన్నుల సేకరణకు అధికారులు ప్రతిపాదనలు పంపంగా 10,000 టన్నులకే గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కానీ తాజాగా ఇచ్చిన ఆదేశాలలో ప్రభుత్వం దానిని 30,000 వరకు పెంచింది. పల్నాడు జిల్లాకు వచ్చేసరికి రబీలో 10,000 టన్నుల సేకరణకు అనుమతులు వచ్చాయి. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన ప్రభుత్వం రబీలో కూడా అదే ఒరవడి కొనసాగిస్తామని ధీమాగా చెబుతోంది. 75 కేజీల ధాన్యం బస్తా ధర గ్రేడ్-ఏ రకం మద్దతుధర రూ.1740 ఉండగా, కామన్ రకం రూ.1725గా ఉంది. ప్రస్తుతం బయట మార్కెట్‌లో మద్దతు ధరకన్నా రూ.150 నుంచి రూ.200 తక్కువగా ఉండడంతో రెతుల చూపు కొనుగోలు కేంద్రాల వైపే ఉంది. దీంతో మంగళవారం నుంచి రైతు సేవా కేంద్రాలు వేదికగా కొనుగోళ్లు జరపనుండడంతో రైతులకు మేలు చేకూరనుంది.

ఈ సారి కూడా పెంచక తప్పదా...

ఖరీఫ్ సీజన్‌లో మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల మూడు జిల్లాల పరిధిలో తొలుత ఇచ్చిన లక్ష్యం కంటే దశలవారీగా అనుమతులు పెంచుకుంటూ రావాల్సి వచ్చింది. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌కు తొలుత ఇచ్చిన లక్ష్యం 50,000 టన్నులే కాగా అది ముగింపుకొచ్చేసరికి 92,000 టన్నుల వరకు వెళ్లింది. ఖరీఫ్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో రబీ ధాన్యం దిగుబడులు నామమాత్రంగా ఉండడంతో అక్కడ సేకరణ విషయంలో ఇంకా స్పష్టత లేదు. పల్నాడు జిల్లాలోనూ రబీకి సంబంధించి పెద్దగా సమస్యలు ఉత్పన్నం కాకపోవచ్చు కానీ బాపట్ల జిల్లాలో లేట్ ఖరీఫ్ దిగుబడులు దాదాపు 42,000 టన్నుల వరకు ఉండడంతో వాటిని మద్దతు ధరకు కొనే విషయంలో రైతాంగంలో ఆందోళన నెలకొంది.

పెంచింది లేట్ ఖరీఫ్ కోసమేనా..

రబీ సీజన్‌లో బాపట్ల జిల్లాకు తొలుత అనుమతి ఇచ్చింది పది వేల టన్నులే కాగా దానిని ఇప్పుడు 30,000 వరకు పెంచారు. లేట్ ఖరీఫ్‌ను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ఈ పెంపు నిర్ణయం తీసుకుందా అనే విషయంలో స్పష్టత లేదు. లేట్ ఖరీఫ్ ధాన్యాన్ని రబీలో కొనడానికి ఉన్న సాంకేతిక ఇబ్బందులను అధికారులు ఇప్పటికే రాష్ట్రస్థాయి కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. కానీ ఆ చిక్కులను తొలగించే విషయంలో ఇంకా ఓ నిర్ణయానికి రాలేదనేది సమాచారం.

ఏప్రిల్ చివరి వారంలో కానీ...

గత ప్రభుత్వంలో రబీ సీజన్ ధాన్యం సేకరణ విషయంలో ఏప్రిల్ చివరి వారంలో కానీ కదలిక మొదలయ్యేది కాదని, ఈ సారి ఏప్రిల్ రెండో వారంలోనే కొనుగోలు కేంద్రాలు తెరవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా తొలుత వచ్చిన అనుమతులతోనే సరిపెట్టకుండా రైతుల అభ్యర్థనల మేరకు పలు దఫాలుగా అధికారులు ప్రతిపాదనలు పంపి నేతల సహకారంతో వాటిని సాధించుకోవడం కూడా అన్నదాతలకు మేలు చేకూరుతోంది.

> **గోనె సంచులు..జీపీఎస్ వాహనాలు**
>
> రైతాంగం ప్రయోజనాలు దెబ్బ తీసే విధంగా మిల్లర్లు వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఖరీఫ్ సీజన్‌లో గట్టిహెచ్చరికలనే ప్రభుత్వం పంపించగలిగింది. క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టడంతో చాలా వరకు మిల్లర్ల మాయాజాలానికి అడ్డుకట్ట వేయగలిగారు. ఖరీఫ్‌లో గోనె సంచుల సమస్య ఉత్పన్నమయింది. దీంతో రబీలో ముందుగానే బ్యాగులను పెద్ద ఎత్తున సంచులను సిద్ధం చేశారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసే వ్యవస్థతో పాటు అన్ని ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఈ విషయంలో ఎవరైనా మిల్లర్లు ఉల్లంఘనలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని ఇప్పటికే అధికారులు హెచ్చరించారు.



చెక్కు అందజేస్తున్న ఇన్‌చార్జి మేయర్ సజీల, అధికారులు

బాలుడి కుటుంబానికి ప్రభుత్వం అండ

- ఐజాక్ కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కు అందజేత

కుక్కల నియంత్రణకు చర్యలు ● ఇన్‌చార్జ్ మేయర్ సజీలా

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వీధి కుక్క దాడిలో మృతి చెందిన బాలుడు ఐజాక్ కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని ఇంచార్జి మేయర్ షేక్ సజీలా అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్వర్ణభారతి నగర్ శివారు ఐద్వా నగర్ లో కుక్క దాడిలో మృతి చెందిన బాలుని తల్లిదండ్రులు రాణి, నాగరాజులను పరామర్శించి, రూ.5 లక్షల చెక్‌ని అందించారు. ఈ సం దర్భంగా మేయర్ మాట్లాడుతూ వీధి కుక్క దాడిలో బాలుడు మృతి చెందడం బాధాకరమని, నగరంలో వీధి కుక్కల నియంత్రణకు నగర పాలక సంస్థ నుండి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం తరుఫునఅండగా ఉంటామని సీఎం తెలిపారన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరపాలక సంస్థ వీధి కుక్కల కుటుంబ నియంత్రణకు కృషి చేస్తుంటే కొంత మంది జంతు ప్రేమికుల పేరుతో తీవ్ర ఆటంకాలు సృష్టిస్తున్నారని, వారు ఇటువంటి ఘటనను చూసైనా తమ వైఖరి మార్చుకోవాలని కోరారు. స్వర్ణభారతి నగర్, ఐద్వా నగర్ పరిసరాల్లో అనధికార మాంస, చేపల విక్రయాలు నిలిపివేస్తామని, అలాగే ప్రత్యేక పారిశుధ్య పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కౌన్సిల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ కె.రవీంద్ర, స్థానిక కార్పొరేటర్ బీ స్మిత పద్మజ, ఎస్ఎస్ సోమశేఖర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జిల్లా ఖజానా శాఖ అధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి



గుంటూరు సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ఖజానా శాఖ అధికారి గా ఎం చంద్రశేఖర్ రెడ్డి నియమితులయ్యారు.ఈ మేరకు సోమవారం ప్రభుత్వం జీఓ విడుదల చేసింది.గత కొద్ది నెలలుగా గుంటూరు జిల్లా ఖజానా శాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసిన రాజగోపాల్ వివాదాల నేపథ్యంలో కొద్ది రోజులు సెలవుపై వెళ్లారు. ఆ తర్వాత ఆయన సర్వశిక్ష అభియాన్‌కు బదిలీ పై వెళ్లారు. తర్వాత ప్రభుత్వం ఎం చంద్రశేఖర్ రెడ్డిని జిల్లా ఖజానా శాఖ అధికారి గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆయన గతంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం చీఫ్ అకౌంట్స్ అధికారిగా పనిచేశారు.

పట్టాల పంపిణీ.. రాష్ట్రానికి రోల్‌మోడల్

- మూడో రోజు 624 మందికి పట్టాల పంపిణీ
- మూడు విడతలుగా అందరికీ పంపిణీ చేస్తాం
- మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్



పట్టా ఇచ్చి ఆప్యాయంగా అలింగనం

మంగళగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నివేశన పట్టాలకు సంబంధించి మంగళగిరిలో తాను అమలు చేస్తున్న విధానాన్ని రాష్ట్రమంతటా పాటించేలా పరిస్థితులు వచ్చాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మన ఇల్లు- మన లోకేశ్ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు సోమవారం స్థానిక డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పట్టాల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నివాసం వుంటున్నవారికి ఆస్థలాలనే క్రమబద్ధీకరించి పట్టాలను పంపిణీ చేయాలంటూ అన్నీ నియోజకవర్గాల్లో శాసనసభ్యులు ఒత్తిడి తెస్తున్నట్టు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి తనతో చెప్పారన్నారు. మంగళగిరిలో వున్నచోటునే స్థలాలను రెగ్యులరైజ్ చేసి పట్టాలిస్తానని తాను హామీని (మిగతా 6వ పేజీలో)

రూ.1534.27 కోట్లతో.. జీఎంసీ బడ్జెట్ ఆమోదం



- ప్రారంభ నిల్వగా రూ. 670.23 కోట్లు..
- జమలు రూ. 864.04 కోట్లు.. ఖర్చులు 1018.23 కోట్లు
- 2025- 26 అంచనాల వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోద ముద్ర
- తాగునీరు.. పారిశుధ్యం, మౌలిక వసతులకు ప్రాధాన్యం
- వీధి కుక్కల దాడిలో బాలుడి మృతిపై కౌన్సిల్ సంతాపం..
- రూ. 5 లక్షల పరిహారం అందజేత

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ 2025-26ను కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం రూ. 1534.27 కోట్ల అంచనాలతో ఆమోదించింది. సోమవారం ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. బడ్జెట్ ప్రారంభ నిల్వగా 670.23 కోట్ల రూపాయలు, అందులో జమలు 864.04 కోట్ల రూపాయలు.. ఖర్చుల కింద 1018.23 కోట్ల రూపాయలతో అంచనాల బడ్జెట్‌ను రూపొందించారు. టీడీపీ, జనసేన, వైసీపీ కార్పొరేటర్ల అభ్యంతరాలు, తప్పుల తడకలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎట్టకేలకు బడ్జెట్‌ను ఆమోదించినట్లు ఇన్‌చార్జి మేయర్ సజీల ప్రకటించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాగునీరు.. పారిశుధ్యం.. మౌలిక వసతుల వంటి సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

నగరంలో వీధి కుక్కలపై కౌన్సిల్లో రగడ

నగరంలో వీధి కుక్కలను నియంత్రించాలని వైసీపీ, టీడీపీ, జనసేన సభ్యులు పట్టుబట్టారు. దీనిపై కమిషనర్ పులి శ్రీనివాస్ స్పందిస్తూ ఐద్వా నగర్‌లో బాలుడు ఐజాక్‌ను కుక్కలు పొట్టన పెటుకున్న ఘటన అత్యంత బాధాకరమని అన్నారు. దానిపై ప్రభుత్వం తగు చర్యలకు ఆదేశించిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి నగరంలో కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు.



నాని, డైమండ్‌బాబు మధ్య వాదోపవాదనలు

బడ్జెట్‌పై రచ్చరచ్చ

కౌన్సిల్ సమావేశంలో 2025- 26 జీఎంసీ వార్షిక బడ్జెట్‌పై జరిగిన సమావేశంలో వైసీపీ, టీడీపీ, జనసేన కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం నడిచింది. తప్పుల తడకగా బడ్జెట్ రూపొందించారంటూ వైసీపీ సభ్యులు అచ్చాల వెంకటరెడ్డి, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, బూసి రాజలత ఆరోపించారు. దీనిపై జనసేన సభ్యులు సంకుర శ్రీనివాసరావు తీవ్రంగా ప్రతిఘటించారు. టీడీపీ సభ్యులు వేములపల్లి శ్రీరాం ప్రసాద్, ఈరంటి వర ప్రసాద్, కొమ్మి నేని కోటేశ్వరరావులు తీవ్రంగా స్పందిస్తూ వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టా రు. దీంతో కౌన్సిల్ సమావేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇన్‌చార్జి మేయర్ సజీల స్పందించి సభ్యులను అదుపు చేశారు. సభను తిరిగి కొనసాగించారు. వాదోపవాదాలు, సుదీర్ఘ చర్చల అనంతరం బడ్జెట్‌ను ఆమోదించినట్లు ఆమె ప్రకటించారు. దీంతో 2025- 26 జీఎంసీ వార్షిక బడ్జెట్ రూ. 1534.27 కోట్లకు ఆమోదం లభించింది.

- అత్యంత ప్రమాదకర పరిస్థితులున్నాయి..
- ఉప్పు, వంటనూనె, చక్కెర తగ్గించాలి
- ట్రీట్‌మెంట్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రోటోకాల్ సిద్ధం చేస్తామన్న సీఎం చంద్రబాబు



గుంటూరులో.. గుండె వ్యాధులు అధికం

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నాయి. వాటి నివారణకు ప్రభుత్వం తీసుకోబోయే చర్యల గురించి సీఎం చంద్రబాబు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందరిని ఆలోచింప చేస్తున్నది. సోమవారం అమరావతి రాజధానిలోని తన కార్యాలయంలో ఆయన వివిధ జిల్లాల నుంచి తెప్పించుకొన్న డేటాని క్రోడీకరించి ఈ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ని రూపొందించారు. అందులో హైరిస్కు జిల్లాల్లో గుంటూరు ఉన్నట్లు స్పష్టమైంది. ముఖ్యంగా ఇక్కడ బీపీ(హైపర్ టెన్షన్), గుండెపోటు, గుండె వ్యాధులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో అత్యంత ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని ఆయన వివరించారు.

ప్రభుత్వం ఇటీవలే ఇంటింటికి ఎన్‌డీసీ సర్వేని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా నిర్వహింప చేసింది. జనాభాలో 5.1 శాతం మందికి మధుమేహం ఉన్నట్లు తేలింది. మహిళల కంటే పురుషులకే ఎక్కువగా ఈ వ్యాధి సోకుతున్నది. గుంటూరు జిల్లాలో ఈ వ్యాధిగ్రస్తులు అధిక సంఖ్యలో ఉన్నట్లు తేలిందని సీఎం పేర్కొన్నారు. గుండె సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య కూడా గుంటూరులోనే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల విషయంలోనూ గుంటూరులో అధికంగా ఉన్నట్లు సర్వేలో తేలింది. హైపర్‌టెన్షన్(బీపీ), గుండెపోటు, గుండెజబ్బులు ఎక్కువమందికి ఉన్న జిల్లాల్లో గుంటూరు ఒకటిగా ఉండటంతో ఇక్కడ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని సీఎం స్వయంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో పేర్కొనడం ఆందోళన కలిగిస్తున్నది. పొగాకు ఇతర అలవాట్ల కారణంగా సర్వైకల్, బ్రెస్టు, ఓరల్ క్యాన్సర్ రోగులు ఎక్కువగా ఉన్న మూడు జిల్లాల్లోనూ గుంటూరు ఒకటిగా ఉన్నది. ఎన్‌సీడీ సర్వే 3.0 జూన్ నాటికి పూర్తి చేసేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నది. ఆ సర్వే పూర్తి అయితే మరింత స్పష్టత వస్తుంది. ఆహార అలవాట్లు మార్చుకోవడం ద్వారా రోగాల బారిన పడే వారి సంఖ్యను తగ్గించుకొనే అవకాశం ఉందని సీఎం చెప్పారు. ముఖ్యంగా ఉప్పు, వంటనూనె, చక్కెర వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తామని, అలానే అమరావతి రాజధానిలో మెడ్ సిటీని నిర్మించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకొంటామని చెప్పారు. అలానే వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించేందుకు ప్రోటోకాల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'నాన్నా నేనొచ్చేస్తా'

ముగిసిన పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని వేదికపై మూడు రోజులపాటు పది నాటికలు ప్రదర్శితమయ్యాయి. ఈ



'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక బృందానికి ఉత్తమ ప్రదర్శన అవార్డును అందజేస్తున్న తెలంగాణకు చెందిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

నాటిక పోటీలకు వివిధ రంగాలకు చెందిన 15మంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా అమృతలహరి థియేటర్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక నిలిచింది. వాస్తవ కథనంతో భావోద్వేగ భరితమైన నటనతో ఇటు న్యాయనిర్ణేతలను అటు ప్రేక్షకుల మనసుల్ని ఆకట్టుకున్న ఈ నాటికకు ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటీనటులు బహుమతులు కూడా లభించాయి.

ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా 'నా శత్రువు'

ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా జయభేరి ఆర్ట్స్, హైదరాబాద్‌వారు ప్రదర్శించిన 'నా శత్రువు' నాటిక నిలిచింది. ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయనటుడు, ఉత్తమ సహాయ నటి బహుమతులు కూడా ఈ నాటికకు దక్కాయి. ఉత్తమ తృతీయ ప్రదర్శనగా సాయి ఆర్ట్స్, కొలకలూరు వారు ప్రదర్శించిన 'జనరల్ బోగీలు' నాటిక ఎంపిక కాగా, ఉత్తమ నటీనటులకు వ్యక్తిగత బహుమతులు లభించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్రం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ విజేతలకు బహుమతులు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.17,21,419 లక్షలు జమ

ముందుకొచ్చిన ఎంప్లాయిస్ సొసైటీ సంఘం డెయిరీ సభ్యులు

తెనాలిరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలకు వరంలా ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్‌కు మేము సైతం అంటూ గుంటూరు జిల్లా ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ సంఘం డెయిరీ సభ్యులు రూ. 17,21,419 లక్షలు జమచేశారు. 1982లో స్థాపించిన సొసైటీ అంచలంచెలుగా ఎదిగి 829మంది సభ్యులను నెలకొల్పింది. ఈ సభ్యులకు అత్యవసరమైతే వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తూ వాటిపై వచ్చిన ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా సభ్యులందరూ కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ అకౌంట్‌కు జమచేశారు. ఈ సందర్భంగా సభ్యులు కొత్తరమేష్‌బాబు మాట్లాడుతూ ఎందరో కష్టాల్లో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. తమ సొసైటీ సభ్యులందరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలన్న ఉద్దేశంతో వడ్లమూడి కెనరాబ్యాంక్ నుంచి సీఎం సహాయనిధికి రూ. 17,21,419 లక్షలు జమచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి చంద్రశేఖర్, చిగురుపాటి శ్రీనివాసరావు, వాసిరెడ్డి జయదత్తు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డాక్టర్ పోస్టుల భర్తీ

వైద్యవిధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ జనార్దన్

వినుకొండటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 173 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు వైద్యవిధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలను కాయకల్ప కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సందర్శించారు. వైద్యశాలను పరిశీలించి పలు విభాగాల వైద్యులకు సూచనలు, సలహాలు అందించారు. బాల్య వివాహాల ద్వారా చిన్నవయసులోనే గర్భవతులు అవుతున్నారని, టీనేజీ మ్యారేజీలను తగ్గించాలని, ఫ్యామిలీ ప్లానింగ్‌పై చైతన్యం కల్పించాలని తెలిపారు. 19 సంవత్సరాల వరకు గర్భవతి కాకూడదని, దీనికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఛాయ టాబ్లెట్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులకు సిజేరియన్ల ద్వారా కాన్పులు చేయడం తగ్గించాలని, దీని ద్వారా పుట్టే పిల్లలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ లైఫ్ స్టైల్ ద్వారా తమ ఆరోగ్య సమస్యలను మెరుగుపరచుకోవచ్చని, చిరుధాన్యాలను అధికంగా తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో గుండెపోట్లు అధికంగా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జనార్దన్, డాక్టర్ సురేష్‌చంద్ర

నమోదవుతున్నాయని తెలిపారు. త్వరలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చొరవతో ట్రామ కేర్ వైద్యశాలతో పాటు డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారి సురేష్‌చంద్ర, డాక్టర్ రాంప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ రజాక్, డాక్టర్లు శ్రీనివాసరెడ్డి, బాలునాయక్, సుధాస్రవంతి, హారిక, వెంకటేష్, సుధాకర్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంగా సుధేష్ణ సేన్ బాధ్యతల స్వీకారం



డీఆర్‌ఎం సుధేష్ణ సేన్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీఆర్‌ఎం సైమన్

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా సుధేష్ణ సేన్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఉదయం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌కు వచ్చిన ఆమె పూర్వ డీఆర్‌ఎం ఎం రామకృష్ణ నుంచి ఛార్జ్ తీసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు రైల్వే అధికారులు, యూనియన్ల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సుధేష్ణ సేన్ 1996 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసు అధికారిణి. ఆమె గతంలో న్యూఢిల్లీలోని నార్తర్న్ రైల్వేలో ఆర్థిక సలహాదారుగా, చీఫ్ అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వహించారు. ఆర్థిక నిర్వహణ, పరిపాలన విధానంలో విశిష్టమైన కెరీర్‌ని ఆమె నిర్మించుకున్నారు. రైల్వే ఫైనాన్స్‌లో తన వ్యూహాత్మక దృష్టి, నాయకత్వంతో ఖ్యాతిని సంపాదించి పెట్టారు. ఆర్థిక శాస్త్రంలో అండర్ గ్రాడ్యూయేట్ డిగ్రీ, పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసి తొలుత నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అలానే రైల్వేలో చేరిన తర్వాత తర్వా సెంట్రల్ రైల్వేస్ ముంబైలో, భోపాల్, జబల్‌పూర్, సౌత్ ఈస్టర్న్ రైల్వే కోల్‌కతాలోని వెస్టు సెంట్రల్ రైల్వేలోనూ బాధ్యతలు నిర్వహించారు. ముందుకు సాగుతుండండి... నేర్చుకొంటూ ఉండండి అన్న సిద్ధాంతాన్ని సుధేష్ణ సేన్ ఎక్కువగా నమ్ముతారు. ట్రెక్కింగ్, దూర ప్రాంతాలకు ప్రయాణం, సంగీతాన్ని ఎక్కువగా ఆస్వాదిస్తారు. డీఆర్‌ఎంని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసిన వారిలో ఏడీఆర్‌ఎం కే సైమన్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టుల మేనేజర్ మనోహర్‌రెడ్డి, వివిధ విభాగాల సీనియర్ అధికారులు జేవీ అనూష, ప్రదీప్‌కుమార్, షాబాజ్ హనూర్, కమలాకర్‌బాబు తదితరులు ఉన్నారు.

ప్రధాని సభకు ప్రత్యేకాధికారిగా వీరపాండ్యన్

గుంటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరగనున్న ప్రధాన మంత్రి సభకు ప్రత్యేక అధికారిగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రభుత్వం చేపట్టబోతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో పీఎంఓ నుంచి ఆమోదం కూడా లభించింది. ఈ నెల 23వ తేదీ తరువాత ప్రధాని రాజధాని అమరావతికి వచ్చి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ బాధ్యతలను ప్రత్యేక అధికారి జీ వీరపాండ్యన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. సభ ఏర్పాట్లలో భాగంగా సోమవారం ఆయన రాజధాని పరిధిలోని వెలగపూడిలో పర్యటించారు. ప్రస్తుత సచివాలయానికి వెనుక భాగంలో 250 ఎకరాల్లో ప్రధాని సభకు ఏర్పాట్లు చేయనున్నారు. ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గుంటూరుజిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏర్పాట్ల గురించి వారితో చర్చించారు. కాగా ప్రధాని పర్యటన ఇప్పటికే ఖరారు కావడంతో సభ నిర్వహణా కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఉన్నతాధికారులకు పలు రకాల బాధ్యతలను అప్పగిస్తోంది.

వ్యక్తిగత గొడవల నేపథ్యంలో యువకుడి హత్య

● 24 గంటల్లోపే నిందితుల అరెస్టు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత గొడవలు, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ యువకుడిని కత్తితో దారుణంగా హత్య చేసిన సంఘటన తాడేపల్లిలో సోమవారం ఉదయం జరిగింది. సీఐ కళ్యాణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఇట్టా వర్ధన్ (22)ను హత్య చేసిన తొత్తుక భరత్ అలియాస్ బంటి మరికొందరు ఇటీవల జరిగిన కుంభమేళాలో పాల్గొనేందుకు ప్రయాగ్‌రాజ్ వెళ్లారు. అక్కడ వస్తువులు, దుస్తులు పోయాయని ఒకరినొకరు దూషించుకోవడంతో వర్ధన్, భరత్‌లకు మధ్య ఘర్షణ జరిగింది. తీవ్రంగా కొట్టుకున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. అక్కడ గొడవలు, పాత ఆర్థిక



నిందితుల వివరాలు తెలుపుతున్న డీఎస్పీ మురళీకృష్ణ, చిత్రంలో సీఐ, ఎస్ఐ

లావాదేవీల నేపథ్యంలో కక్ష పెంచుకున్న భరత్ మరో వ్యక్తి కలిసి స్థానిక పట్టాభి రామయ్య కాలనీలోని మృతుడి నివాసంలోనే తెల్లవారు జామున 1.30 గంటల సమయంలో కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో వర్ధన్ తీవ్రంగా గాయ పడ్డాడు. కుటుంబసభ్యులు కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. చికిత్స నిమి త్తం 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందినట్టు ప్రభుత్వాస్ప త్రి వైద్యులు నిర్ధారించినట్టు సీఐ కళ్యాణరాజు తెలిపారు. మృతుడి అక్క రుద్రవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. జరిగిన ఘటనపై మృతుడి అక్క రుద్రవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఈ కేసులో నిందితులైన తొత్తుక భరత్ అలియాస్ బంటి, ఇసుకపల్లి ప్రకాష్‌లను సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసినట్లు నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. 24 గంటల్లోపే కేసును ఛేదించిన సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్ఐలను ఉన్నతాధికారులు అభినందించారు.

చకచకా రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు

● వైసీపీ ప్రభుత్వంలో చెప్పులరిగేలా తిరిగినా కాని రిజిస్ట్రేషన్లు
● కూటమి పాలనలో 87 శాతం పూర్తి

తుళ్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతమైంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ-లాటరీ పద్ధతిలో స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు ప్లాట్ల కేటాయింపును ప్రారంభించారు. ఆ తరువాత అధికారులు గ్రామాల వారీగా కేటాయింపులు చేశారు.



తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రైతులు

వాణిజ్య, నివాస ప్లాట్లు కలిపి రాజధాని 29 గ్రామాలకు చెందిన రైతులకు 68 వేల ప్లాట్ల కేటాయించారు. ఆ సమయంలోనే 50 శాతం రిజిస్ట్రేషన్‌లు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయండని ఎంత అడిగినా కానీ నెలకు ఒకటి రెండు ప్లాట్ల కన్నా చేయలేదు. అది కూడా లంచాలు తీసుకొని ఒకటికి పది సార్లు రైతులను కార్యాలయాలు చుట్టూ తిప్పి చేశారనే ఆరోపణలున్నాయి. తిరిగి చంద్రబాబునాయుడు అధికారంలోకి రావటంతో అమరావతి అభివృ ద్ధిపై దృష్టి పెట్టడంతో అధికార యంత్రాంగం కదిలింది. గత టీడీపీ ప్రభుత్వంలో అనంతవరం, తుళ్లూరు, మందడం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలే కాక ఇప్పుడు ల్యాండు పూలింగ్ యూనిట్ ఆఫీసుకు ఒకటి చొప్పున 9 చోట్ల రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటి వరకు 87 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. మిగిలి ఉన్నవి కూడా త్వరగా పూర్తి చేయాలని సీఆర్డీఏ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. సోమ వారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో ఇలాంటి ఆటలు పోటీలు నిర్వహించడం చాలా



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

శుభ పరిణామమన్నారు. తద్వారా ఉద్యోగుల మధ్య సఖ్యత పెరిగి మనస్పర్థలు లేకుండా పనిచేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఎప్పుడూ కార్యాలయంలోనే కూర్చొని పనిచేస్తున్న ఉద్యోగులకు ఇలాంటి ఆట పోటీలతో శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ ఇన్చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్న షీలామణి, రిజిస్టర్ ఆచార్య జీ సింహచలం, యూనివర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గాలి దుమారం

● మోస్తరుగా వర్షం
● తాడికొండ, మంగళగిరి, తుళ్లూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి ఎండ మండిపోగా సాయంత్రం 6 గంటల సమయం దాటిన తర్వాత జిల్లాలోని కొన్ని మండలాల్లో గాలి దుమారం రేకెత్తించింది. సోమవారం సాయంత్రం ఆకాశంలో దట్టమైన కారుమబ్బులు కమ్ముకొని భారీ వర్షం కురుస్తుందేమోనన్న వాతావరణాన్ని తలపించింది. అయితే గాలి బలంగా వీచడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఊడి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపడటంతో పలు మండలాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 6.30 గంటలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా రాత్రి 8.30 గంటల వరకు కూడా పునరుద్ధరణ జరగలేదు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా చాలా చోట్ల రాత్రి 8 గంటల లోపే విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని, కొన్ని చోట్ల మాత్రం రాత్రి 9 గంటలకు సప్లై ఇస్తామన్నారు. గాలి కారణంగా దుమ్ము, ధూళి ఎగిసిపడుతూ రోడ్లపై పాదచారులు, ద్విచక్ర వాహనదారుల కళ్లల్లోకి చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలి దుమారం మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు, తాడికొండ, గుంటూరు నగరం, పెదకాకాని, వట్టిచెరుకూరులోనే ఎక్కువగా ప్రభావం చూపించింది. తెనాలి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి గాలి/వర్షం కురవలేదు. వర్షం రాక ముందు ఆకాశంలో మెరుపులు మెరిశాయి. కొన్ని గ్రామాల్లో ఉరుములు ఉరిమాయి. భారీ వర్షం తప్పదనుకున్న తరుణంలో గాలి కారణంగా వర్షం వెలిసిపోయింది. బలమైన ఈదురుగాలులు వీధి వ్యాపారులకు నష్టం కలిగించాయి. ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్ల కేబుల్స్ ఎక్కడికక్కడ తెగిపోయాయి. దీంతో కొన్ని చోట్ల ఇంటర్నెట్ సేవలకు ఆటంకం ఏర్పడింది.



గుంటూరు నగరంలో ఆకాశంలో మెరుస్తున్న మెరుపులు

హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా జిల్లా జడ్జి పార్థసారథి

● గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కల్యాణ చక్రవర్తి



కల్యాణ చక్రవర్తి

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న వైవీఎస్‌బీజీ పార్థసారథిని రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న బీ సాయి కల్యాణ చక్రవర్తిని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమించింది. రాష్ట్రంలోని వివిధ కోర్టులో పనిచేస్తూ ఆ ప్రాంతంలో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పలువురు జిల్లా జడ్జిలను మరో చోటికి బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లాకు సంబంధించి ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా పని చేస్తున్న డి. తిరుమలరావును శ్రీకాకుళం జిల్లా లక్ష్మీపేటలో గల ఐదవ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేసింది. ఖాళీ అయిన ఆయన స్థానంలో ప్రస్తుతం ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జిగా పని చేస్తున్న డి. రాములును నియమించింది. గుంటూరు పోక్సో కోర్టులో స్పెషల్ జడ్జిగా పనిచేస్తున్న ఏ అనితను విజయవాడలోని ప్రజా ప్రతినిధుల నేరాల విచారణ స్పెషల్ కోర్టుకు బదిలీ చేసింది. ఖాళీ అయిన ఆమె స్థానంలో ప్రస్తుతం నెల్లూరులోని 7వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న షమీ పర్వీన్ సుల్తానా బేగంను నియమించారు. ప్రస్తుతం విజయవాడలోని ఏసీబీ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న బి.సత్య వెంకట హిమబిందును రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీగా బదిలీ చేశారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచవరం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న పది క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆటోను ఆదివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పొన్నూరు రూరల్ ఎస్ఐ గండు కిరణ్ కథనం ప్రకారం రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో సోదాలు నిర్వహిస్తుండగా ఆటోలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి కేసు నమోదు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పట్టాల పంపిణీ.. రాష్ట్రానికే రోల్‌మోడల్

(5వ పేజీ తరువాయి)



మంత్రి లోకేశ్‌ను అప్యాయంగా దీవిస్తున్న ఓ అవ్వ

ఇచ్చినపుడు చాలమంది అనుమానపడ్డారన్నారు. కానీ తాను చిత్తశుద్ధితో పనిచేసి ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నానన్నారు. మంగళగిరిలో ఆక్రమిత నివాసాలు మూడు రకాల భూముల్లో వున్నాయన్నారు. తొలి విడతలో అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నివాసం ఉంటున్న మూడు వేల మందికి పట్టాలిస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ వేయి కోట్ల రూపాయల వరకు ఉంటుందన్నారు. రెండో విడతలో దేవాదాయశాఖ, రైల్వే భూముల్లో నివాసముంటున్న వారికి, మూడవ విడతలో అటవీ, ఇరిగేషన్ భూముల్లో ఉంటున్నవారికి పట్టాలను పంపిణీ చేసేవిధంగా షెడ్యూల్‌ను రూపొందించామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన పది మాసాల్లోనే గౌరవంగా ఇంటిపట్టాలను అందజేస్తున్నామన్నారు. ఇదీ తనకున్న కమిట్‌మెంట్ అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

ఆనందభాష్పాలు రాల్చిన వృద్ధులు

లబ్ధిదారులందరూ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా నివేశన పట్టాలను అందుకుంటూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు, పాతిక ముప్పై ఏళ్లుగా వుంటున్న తమకు ఇళ్లపట్టాలు ఇక రావేమోనని అనుకుంటున్న తరుణంలో వున్నచోటునే ఇంటిపై హక్కులు కల్పిస్తూ లోకేశ్ పట్టాలను అందజేయడం తమకెంతో ఆనందాన్ని కలిగించిందంటూ హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. తాము వైసీపీ అయినా తమకు పట్టా ఇచ్చా రని కొలనుకొండకు చెందిన నల్లపు పార్వతి, వెంకట నర్సయ్య అన్నారు. 37 ఏళ్లుగా పట్టాల కోసం ఎదురు చూస్తున్నాం. పదినెలల్లోనే మా సమస్యను తీర్చారు అని తాడే పల్లికి చెందిన షేక్ సర్దార్‌బీ, సైదులు ఆనందం వ్యక్తం చేశారు.

భారీ మెజారిటీ వల్లే ఈ అభివృద్ధి

ఇదంతా మంగళగిరి ప్రజలు తనకిచ్చిన భారీ మెజారిటీ కారణంగానే సాధ్యపడిందని లోకేశ్ చెప్పుకొచ్చారు. మంగళగిరి అభివృద్ధి కోసం బాబు, పవన్నతో పోరాడి నిధులు తెచ్చి మంగళగిరిని అభివృద్ధి చేస్తానని నాడు మాటిచ్చా. ఆ మాట ప్రకారమే అంతా చేస్తున్నా అని అన్నారు. 2019 ఎన్నికల్లో తాను ఓటమి పాలైనప్పుడు అందరూ తనను ఎగతాళి చేశారన్నారు. 2024 ఎన్నికల్లో మంగళగిరి ప్రజలు తనకిచ్చిన భారీ మెజారిటీని చూసి ప్రత్యర్థులకు సౌండ్ లేకుండా పోయిందన్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం కూడ కావాలని విజ్ఞప్తి చేశారు. చెత్తను రోడ్లపై వేయవద్దని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. స్వచ్ఛతలో మంగళగిరి నెంబర్ వన్ కావాలన్నదే తన లక్ష్యమన్నారు.

624 మందికి పట్టాల పంపిణీ

మూడవ రోజు సోమవారం నియోజకవర్గంలో మొత్తంగా 624 మందికి మంత్రి నారా లోకేశ్ నివేశన పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, టీడీపి నేతలు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, జవ్వాది కిరణ్‌చంద్, కొమ్మారెడ్డి కిరణ్‌కుమార్, తోట పార్థసారధి, తెలుగు మహిళలు ఆరుద్ర భూలక్ష్మీ, యలమంచిలి పద్మజ, మంచికలపూడి వైష్ణవి, వింజమూరి ఆషాబాల, ఏపీఎంఎస్ఐడీసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 516.30 అడుగులు ఉంది. ఇది 142.61 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 2053 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4881 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 8734 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,37,288 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,53,787 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,37,288 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 64,276 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13400
273	10000	12900
341	10500	14000
4884	10000	11900
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10300	13500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10500	12400
బ్యాడిగి 355	10000	13300
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10300	12700
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6300



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

సచివాలయం కేంద్రంగా పారిశుధ్య పనులు జరగాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయం కేంద్రంగా పారిశుధ్య పనులు జరగాల ని, శానిటేషన్ కార్యదర్శి నూరుశాతం పారిశుధ్య పనులకు బాధ్యత వహిం చాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, నల్లకుంట, ఎన్జీవో కాలనీ, నగరా లు, గోరంట్ల తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనుల ను పరిశీలించారు. ఈ పర్యటనలో బయాలజిస్ట్ రామారావు, డీఈఈ రమేష్‌బాబు, ఏసీపీ వెంకటే శ్వరరావు, ఎస్ఎస్ రాజేష్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

● అన్న క్యాంటీన్లలో ప్రతి రోజు నిర్దేశిత సమయంలో ఆహారం అందించాలని కమిషనర్ అక్షయ పాత్ర సిబ్బందికి చెప్పారు. సోమవారం అమరావతి రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి ఆహారం తీసుకుంటు న్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ నెల 30 లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2అర్ధ సంవత్సరాల మొత్తం ఆస్తి పన్నును ఏక మొత్తంగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొ త్తం పన్నుపై 5శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని, సోమవారం నుంచి ఈఆర్పీ సర్వర్ అందుబాటులోకి వచ్చినందున నగరం లోని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

పేదలను ఆదుకొనేందుకు ముందుకు రావాలి

● ఐఎంఏ వైద్యులకు డీఎంహెచ్‌వో పిలుపు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన పీ-4 కార్యక్రమం స్ఫూర్తిగా జిల్లాలో ఉన్న పేద లను ఆదుకొనేందుకు వైద్యులు ముందుకు రావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి కోరారు. సోమవారం తన ఛాం బర్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యులతో పాటు నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో నిర్వహించిన సమా వేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పేదల జీవితాల్లో వెలుగులు నిం పేందుకు, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వైద్యులు సహకరించాలని కోరారు. దీనిపై ఐఎంఏ డాక్టర్లు సానుకూ లంగా స్పందించారు. రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి డీఎంహెచ్‌వోను, ఇతర అధికారులను ఆహ్వానిస్తామని, పలు అంశాలను అప్పుడు చర్చించవచ్చని వారు వివరించారు. దీనికి డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ లక్ష్మి ఆమోదం తెలిపారు. అదేవిధంగా డీఎంహెచ్‌వో అభ్యర్థన మేరకు రూ.18 లక్షల విలువైన వైద్య పరికరాలు విరాళంగా అందజేసే విషయంపై కూడా ఐఎంఏ డాక్టర్లు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జికి మరిన్ని నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న సీపీఐ నాయకులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కేటాయించిన నిధులతో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం పూర్తికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ అన్నారు. స్థానిక కొత్త పేట, మల్లయ్య లింగం భవన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజల చిరకాల కోరిక శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణంతో తీరనుందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణా నికి రూ.170 కోట్లు అంచనా వేసి, రూ.100 కోట్లు కేటాయించడం సరైంది కాదని అన్నారు. చాలీచాలని నిధుల వల్ల బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపిస్తుందని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నాణ్యత ప్రమాణాలతో బ్రిడ్జి నిర్మాణం జరగాలన్నారు. సమావేశంలో మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సామూహిక ఉపనయనములు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో సోమవారం ఉచిత సామూహిక ఉపనయనములు ఘనంగా నిర్వ హించారు. బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం 7:30గంటలకు చైత్రమాసం, శుద్ధ దశమి పుష్యమి నక్షత్ర యుక్త మేష లగ్న పుష్కరాంశ నందు వటువులకు ఉపనయ సంస్కారం జరిపారు. కార్యక్రమాలను సమితి అధ్యక్షుడు నందిరాజు పాండురంగారావు, కార్యదర్శి రంగా వజ్రాల లక్ష్మీపతి, కోశాధికారి తుళ్ళూరు ప్రకాష్, కన్వీనర్ మాదాల వెంక టకృష్ణ, కోకన్వీనర్ కర్లపాలెం బాలకృష్ణ, సభ్యులు జి.రామకృష్ణారావు, ఎం కోదండ రామారావు తదితరులు పర్యవేక్షించారు.

పెన్షనర్లు వైద్య ఖర్చులు ఎలా పొందాలంటే

● ఈదర వీరయ్య

గుంటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోని పెన్షనర్లు, ఉద్యోగులు వైద్య ఖర్చులు ఎలా పొందాలో పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు, గ్రం థాలయ సంస్థ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వైద్య ఖర్చు ల నిమి త్తం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం సౌకర్యం కల్పించింది (మెడికల్ రియింబర్స్‌మెంట్). పే స్కేలు ఆధారంగా ఉద్యోగులను 3 కేటగిరీలుగా విభజిస్తారని, రూ.50వేల లోపు ఖర్చులను జిల్లా స్థాయి అధికారి మం జూరు చేస్తారన్నారు. వైద్య బిల్లులు, జిల్లా మెడికల్ బోర్డు సంబంధిత హాస్పి టల్ సూపరింటెండెంట్ పరిశీలిస్తారన్నారు. రూ.50 వేలు దాటితే రాష్ట్ర స్థాయిలో సంబంధిత విభాగాల అధికారికి పంపాలన్నారు. ఉద్యోగి నుల ప్రసూతి, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు ప్రభుత్వ ప్యాకేజి ప్రకారం సాయం చెల్లిస్తారని తెలిపారు. ఒక వ్యాధికి ఎన్ని పర్యాయాలైనా సాయాన్ని పొందవచ్చు. దీనికి ప్రత్యేక వైద్యుడి అనుమతి పొందాల న్నారు. దంతవైద్యానికి సంబంధించి ఎలాంటి కేసులోనైనా రూ.10వేల లోపు మాత్రమే ప్రభుత్వం వైద్యఖర్చులు చెల్లిస్తుందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆమోదం లేని ఆస్పత్రు ల్లో చికిత్స పొందినా వైద్య ఖర్చులు చెల్లిస్తారన్నారు. దీనికి పోలీసు ఎఫ్ఐఆర్ జతపరచాలన్నారు. జీవో ఎంఎస్ నెంబర్ 105 ప్రకారం సర్వీ సులో ఉన్న ఉద్యోగులకు వారిపై ఆధారపడిన వారికి పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు 2 లక్షలకు మించకుండా చెల్లిస్తారన్నారు.. కుటుంబ పెన్షనర్లకు కూడా చెల్లిస్తారని తెలిపారు. కావాల్సిన ధ్రువపత్రాలు డిశ్చా ర్జి సమ్మరి ధ్రువపత్రం, అత్య వసర ధ్రువపత్రం, ఎసెన్షియాలిటి ధ్రువప త్రం, పెన్షనర్స్‌పై ఆధారపడిన వారి డిక్లరేషన్, ప్రభుత్వం నుంచి గతం లో డబ్బు పొందలేనదనే పత్రం, చెక్లిస్టు, ఒరిజినల్ వైద్య బిల్లులు, ఆస్ప త్రికి చెందిన రిఫరల్ జీవో కాపీ, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ వీటితో పాటు అభ్యర్థి దరఖాస్తును సంబంధిత డీడీవో ధ్రువీకరించిన ఒరిజనల్ సెట్‌తో పాటు మూడు అటెస్టడ్ సెట్స్‌ను సంబంధిత జిల్లా స్థాయి అధికారికి పంపి వైద్య సాయం పొందాలని వీరయ్య తెలిపారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

● ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ భార్గవతేజ్

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 235 అర్జీలు

● పరిష్కరించాలని ఆదేశాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ తదితరులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అం దిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ బార్గవ తేజ ఆదేశించారు. సోమవారంకలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 235 అర్జీలు వచ్చా యి. డీఆర్వో ఖాజావలీ, స్టెప్ సీఈవో చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగ రాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. భార్గవ తేజ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులను సమీక్షిస్తూ గౌరవ కోర్టులకు ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు పరచాల న్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, హౌసింగ్ పీడీ శంకర్, డీపీవో నాగ సాయికుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సువార్త, డీఎస్‌వో కోమలి పద్మ, డీటీసీ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నగర పరిధి, 27వ డివిజన్ నల్లపాడు చెరువు వాగు పోరంబోకు ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు షకూర్, ప్రఖ్యా తా, అంబేద్కర్ అర్జీ అందజేశారు. జీఎంసీ నుంచి 2.70 ఎకరాలను అను మతి పొంది, దాదాపు 5 ఎకరాలను ఆక్రమించి శాలిని డెవలపర్ సంస్థ వారు వెంచర్లు వేసి విక్రయిస్తున్నారని తెలి పారు. ఆక్రమణదారులకు నగరపాలక సంస్థ అధికారులు సహకరిస్తున్నారని ఆరోపిం చారు. ఆక్రమణలు తొలగించి సదరు స్థలాన్ని చెరువులో కలపాలని కోరారు.

● జిల్లాలో ఆలింకో క్యాంపు ఏర్పాటు చేసి దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు అందిం చాలని విభిన్న ప్రతిభావంతుల ఆదరణ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు వెలుగు శివప్రసా దు కోరారు. ఈ మేరకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఈ ప్రకియ పూర్తయిందని, గుంటూరు జిల్లాలో మాత్రం పెండింగ్‌లో పెట్టారని అన్నారు. గత ప్రభుత్వం బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయలేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీనివాస్ చౌదరి, సాయి ఉన్నారు.

● ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు నగరంలో స్థానిక లాడ్జీ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఎస్ఆర్ శంకరన్ ప్రజాసంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు అర్జీ అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నల్లపు నీలాంబరం, బండ్లమూడి స్టాలిన్, చుక్కా దేవ రాజు, చిన్నం డేవిడ్ విలియమ్స్ తదితరులు ఉన్నారు.

● నివాసానికి దగ్గర బదిలీ చేయిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశారని అంగన్‌వాడీ కార్యకర్త టీ రాజేశ్వరి అర్జీ అందజేశారు. వెంకటప్ప య్య కాలనీలో నివాసముంటూ, ముత్యాలరెడ్డి 1వలైన్‌లో అంగన్‌వాడీ టీచ ర్‌గా 2012 నుంచి విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈ మధ్యనే వెంక టప్పయ్య కాలనీకి దగ్గరగా యతిరాజునగర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉండటంతో దరఖాస్తు చేసుకున్నానని అన్నారు. ఈ విషయం తెలు సుకుని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న దీప్తి మనోజ ఈ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2 లక్షలు ఇవ్వాలని చెప్పిందని పేర్కొన్నారు. తొలి విడతగా రూ.లక్ష చెల్లించానని, కాని ఈ ఉద్యోగాన్ని వేరే వ్యక్తికి రూ.4 లక్షలకు అమ్ముకుందని వివరించారు. దీంతో గతంలో ఇచ్చిన లక్ష నాకు ఇవ్వాలని అడిగానని, దీంతో దీప్తి మనోజ బెదిరిస్తోందని అన్నా రు. దీనిపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారని అన్నారు. కేసును ఉపసంహరించుకోవా లని లేదంటే అసలు ఉద్యోగం లేకుండా చేస్తానని హెచ్చరిస్తుందని వాపో యింది. ఉన్నతాధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

బాలీవుడ్ హీరోలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి హాని కలిగించే పాన్ మసాలా ఉత్పత్తులను ప్రోత్సహించే విధంగా ప్రచారం కల్పిస్తున్న బాలీవుడ్ హీరోలపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవాలని ఏపీ సిటి జన్ రైట్స్ ఫోరం ప్రతినిధులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫోరం అధ్యక్షుడు జిలాని ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సోమవారం ఎస్పీని కలిశారు. ఎస్పీని కలిసిన వారిలో న్యాయవాదులు, ఏపీ సిటిజెన్ రైట్స్ ఫోరం అధ్యక్షులు జిలాని, నూనె పవన్ తేజ, పాలపాటి అనిల్ కుమార్, సత్య, సైదా, షారుక్ తదితరులు ఉన్నారు.



ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

రైస్ పుల్లింగ్ పేరుతో కోటి 47 లక్షలు తీసుకొని మోసం

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైస్‌పులింగ్ ద్వారా కోట్ల రూపా యలు వస్తాయని తన భర్తకు మాయమాటలు చెప్పి తమ నుంచి కోటి 47 లక్షలు తీసుకొని మోసం చేశారని చల్లావారిపాలెం గ్రామానికి చెందిన గోగుల నాసరమ్మ ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తన భర్త ఆంజనే యులుకు, అతడు స్నేహితుడు ద్వారా బుచ్చయ్యతోటకు చెందిన ఫిజియో థెరపిస్టు లాం జీవన్ కుమార్ పరిచయమయ్యాడు అన్నారు. తన భర్తకు మాయ మాటలు చెప్పి రెండు లారీలను, ఒక కారును అమ్మించి 40 లక్షలు తీసుకున్నాడు. అదే విధంగా 2023 డిసెంబర్లో మరోసారి మాయ మాటలు చెప్పి మూడు లక్షలు తీసు కున్నాడు అన్నారు. ఇలాఉంటే విజ యవాడ చెందిన సతీష్‌ని మోసం చేయడంతో ఆయన లాం జీవన్ కుమా ర్‌ను నిర్బంధించడంతో తమకు ఫోన్ చేసి తన భార్యను తీసుకొచ్చి విడి పించాలని వేడుకోవడంతో తాను వెళ్లి నాలుగు రోజులు గడువిస్తే రూ.25 లక్షలు ఇస్తానని సతీష్ తో ఒప్పందం చేసుకొని జీవన్ కుమార్‌ను విడిపించానన్నారు.

ఒప్పందం ప్రకారం బంగారంతో పాటు ఆస్తులను తాకట్టుపెట్టి 25 లక్షలు తీసుకువెళ్లి సతీష్ కు ఇచ్చానన్నారు. అదేవిధంగా లాం జీవన్ కుమార్ తో పాటు మల్ల శివకృష్ణ, కేరళ కు చెందిన జో, చెన్నైకి చెందిన విజయానంద్, మతన్ కుమార్, విజయ్ అనే వారు రాయల్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ పేరుతో హెచ్డిఎఫ్సి బ్యాంకులో 18 కోట్లు ఉన్నట్లు నకిలీ డిడి చూపించి మాటలు చెప్పి 2023 జూలైలో తన భర్త నుంచి డబ్బు తీసుకున్నారన్నారు. ఈ విధంగా కోట్ల రూపాయలు వస్తాయంటూ ప్రతిసారి మాయమాటలు చెప్పి తన నుంచి కోటి 47 లక్షలు జీవన్ కుమార్ తీసుకున్నారన్నారు. తమకు జరిగిన మోసంపై విచారించి నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు. అదేవిధంగా లాం జీవన్ కుమార్ ఇటీవల హైదరాబాదులో సైబర్ నేరాలకు పాల్పడి అరెస్టు అయినట్లు తెలిపారు.

నమ్మకంగా మత్తు పెట్టి బంగారం కాజేసింది

తనకు కొత్తపేటకు చెందిన జాకీర అనే మహిళ పరిచయమై బంగారు ఆభరణాలు కాజేసిందని వెంకటరమణ కాలనీ 2/4 కి చెందిన చిరతనగండ్ల వాసు భార్య మంగాదేవి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తనకు కొత్తపేట ఆంధ్ర బ్యాంకులో ఖాతా ఉందని, బ్యాంకుకు వెళ్లిన సమయంలో అక్కడ జాకీర అనే మహిళ పరిచయమై తన డ్వాక్రా గ్రూపులో ఒక సభ్యురాలు ఖాళీగా ఉందని తనను చేరమని కోరడంతో తాను అంగీకరించానన్నారు. ఈ క్రమంలో రెండు లక్షల రుణం ఇప్పిస్తానని అయితే పొదుపు డబ్బులు 23 వేలు చెల్లించాలని అడగడంతో ఆ మొత్తం చెల్లించానన్నారు. ఆ తర్వాత తన భర్తకు కూడా రెండు లక్షలు లోన్ ఇప్పిస్తానని మరో 23 లక్షలు కట్టాలని కోరిందన్నారు. ఈ క్రమంలో కొత్తపేటలోని అభిలాష హోటల్ ఎదురు సందులో ఉంటున్న ఆమె ఇంటికి పిలిపించి తనకు పూరీ పెట్టిందన్నారు అది తిన్న కొద్ది సమయానికి తాను మత్తు లోకి వెళ్లగా తనను బంగారు షాపు వద్దకు తీసుకువెళ్లి చెవి పోగులు ఉంగరం తాకట్టుపెట్టి 23 వేలు తీసుకుందన్నారు. దీనిపై కొత్తపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు.

వ్యాపారం పేరుతో కోటి నాలుగు లక్షల తీసుకొని మోసం

కో వర్కింగ్ ఆఫీస్ బిజినెస్ పేరుతో తన నుంచి కోటి నాలుగు లక్షలు తీసుకొని మో సం చేశాడని హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంనకు చెందిన బలుసుపల్లి ప్రవీ ణ్‌కుమార్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2019లో తనకు వేమూరి సురేష్ అనే వ్యక్తి ద్వారా పగడాల సతీష్ కుమార్ పరిచయం అయ్యాడు అన్నారు. కో వర్కింగ్ ఆఫీస్ బిజినెస్ పేరుతో విడతల వారీగా సతీష్‌కుమార్ తన నుంచి 35 లక్షలు తీసుకున్నాడు అన్నారు. అదేవిధంగా వేమూరు సురేష్ 69 లక్షలు తీసుకున్నాడు అన్నారు. ఆ తర్వాత నుంచి వారు కనిపించకుండా పోయారన్నారు.

అప్పటి నుంచి వారి కోసం గాలిస్తుండగా గుంటూరులోని శ్రీనగర్ 7/7లో నివాసం ఉంటున్నట్లు తెలిసిందన్నారు. వ్యాపారం పేరుతో తన దగ్గర డబ్బులు తీసుకోవడమే కాకుండా డబ్బులు అడిగితే చంపు తామని బెదిరించిన సతీష్ కుమార్‌తో పాటు ఆయన అనుచరులపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు ప్రవీణ్ కుమార్ ఎస్పీ కార్యాల యంలో ఇచ్చిన ఫిర్యాదులో వేడుకున్నాడు.

గుంటూరులోని సీఐడీ కార్యాలయానికి పోసాని

● 15న విచారణకు హాజరుకావాలని సూళ్ళూరుపేట పోలీసుల నోటీస్

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బెయిల్ సందర్భంగా సినీ నటుడు పోసానికి కోర్టు విధించిన షరతుల నేపథ్యంలో సోమవారం ఆయన గుంటూరులోని సీఐడీ కార్యాలయానికి హాజరై సంతకం చేసారు. ఈ సందర్భంగా ఆయనకు తిరుపతి జిల్లా సూళ్ళూరుపేట పోలీసులు నోటీస్ జారీ చేసారు. ఆయనపై సూళ్ళూరుపేట పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదైందని వారు చెప్పారు. ఆ కేసు విచారణలో భాగంగా ఈ నెల 15న సూళ్ళూరుపేట స్టేషన్‌కు హాజరుకావాలంటూ నోటీస్ జారీ చేసారు. సీఐడీ కార్యాలయంలో సంతకం చేసిన అనంతరం ఆయన తిరిగి హైదరాబాద్‌కు వెళ్ళిపోయారు.

కర్రలతో దాడి చేస్తుంటే ఏం చేస్తున్నారు

● పాత గుంటూరు పోలీసులపై ఐజీ త్రిపాఠి అసహనం

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు పో సులపై గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి అసహనం వ్యక్తం చేశారు. సోమవారం పాత గుంటూరు పరిధిలోని ఆనందపేటలో ఆయన తనిఖీలు చేశారు. ఈనెల ఒకటో తేదీన రెండు వర్గాల మధ్య జరిగిన కర్రల దాడిలో షేక్ కాజాబీ(70) వృద్ధురాలు మృతి చెందింది. అంతటితో ఆగని ఒక వర్గం గుంటూరు ప్రభుత్వాస్పత్రి వద్ద మరో ఇద్ద రిపై దాడి చేశారు. ఈ రెండు సంఘటనలపై సమగ్ర విచారణ చేసిన ఐజి పోలీసుల సకాలంలో స్పందించకపోవడం వల్లే వృద్ధురాలు మృతి చెందినట్లు ఐజి పరిశీలనలో తెలిసింది. దీంతో పాత గుంటూరు సీఐ సోమయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి సంఘటనలు పున రావృత్తమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు పోలీసు లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగం గా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్‌హస్సేన్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ కాలనీ, మంగళదాస్‌నగర్, అంబేద్కర్‌నగర్, అరుంధతీనగర్, నవభారత కాలనీ, రాఘవనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఐ సెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీస్ పీజీ కళా శా లలో ఈనెల 9 నుంచి డిగ్రి పూర్తి చేసిన విద్యార్థులకు ఐసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అని తాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు ప్రాక్టీస్ టెస్టు, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, రీజనింగ్, ఎనలైటికల్ ఎబిలిటీ, మ్యాథమాటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్ వంటి విషయాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు డాక్టర్ రవికుమార్ (9701172533), ఎం శివకొండయ్య, (9676674858)లను సంప్రదించాలని సూచించారు.

ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉంటూ చనిపోయిన ఉద్యోగుల డిపెండెంట్‌లు ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వులను ఇన్ చార్జి కలెక్టర్ అమిలినేని భార్గవతేజ అందజేశారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కారు ణ్య నియామకంలో భాగంగా బీ రాజ్యలక్ష్మిని జూనియర్ అసిస్టెంట్‌గా, ఎం దుర్గాభవానిని ఆఫీసు సబార్డినేట్‌గా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ఇన్‌చార్జి కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్‌వో షేక్ ఖాజావలి, గుంటూరు ఆర్ డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు పాల్గొన్నారు.

గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ల అందజేత

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల నిర్వహణ, ఫ్యామిలీ పెన్షన్ ఇతర సదుపాయాలను పర్యవేక్షించుటకు ప్రభుత్వం నియమించిన సంరక్ష కులకు సోమవారం శంకరన్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవతేజ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్లను అందజేశారు. దివ్యాంగులకు అందాల్సిన సదుపాయాలకు బృందావన్ గార్డెన్స్, విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో సంరక్షకులను సంప్రదిం చాలని సూచించారు.

బాలికపై అత్యాచారయత్నం

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధి లో ఎల్‌కేజీ చదువుతున్న ఆరేళ్ల బాలికపై దాసరిపాలేనికి చెందిన పాముల శ్రీనివాసరెడ్డి (50) అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు ఉదయాన్నే కూలి పనులకు వెళ్లారు. శ్రీనివాస రెడ్డి ఇంటి లోకి వెళ్లి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె పెద్దగా కేకలు పెట్టడంతో పారిపోయాడు. పని నుంచి వచ్చిన తర్వాత విషయం తెలుసు కున్న బాలిక తల్లిదండ్రులు నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్రీనివాసరెడ్డిపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

ఫోక్సో కేసులో తప్పించుకు తిరుగుతున్న రౌడీషీటర్ అరెస్టు

పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ అయిన రవీంద్రనగర్ కు చెందిన భవనం జగన్మోహన్‌రెడ్డి 2022లో ఓ బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. నాలుగు నెలలుగా కోర్టు వాయి దాలకు హాజరుకాకపోవడంతో మేజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. సోమవారం పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది రౌడీషీటర్ జగన్మోహనరెడ్డిని అరెస్టు చేసి ఫోక్సో కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ ఆయనకు రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు.

వీధి కుక్కల దాడిపై కౌన్సిల్ సంతాపం

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు ఐజాక్ మృతి సంఘటనపై గుంటూరులో కలకలం రేపింది. సోమవారం జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమా వేశంలో కార్పొరేటర్లు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు. బాలుడు ఐజాక్ మృతికి నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సంతాపం తెలిపింది. సమావేశంలో అనేకమంది కార్పొరేట ర్లు మాట్లాడుతూ ఇటువంటి సంఘటన జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల ప్రకటించారు. కౌన్సిల్‌లో బడ్జెట్ సమావేశం జరుగుతుండగానే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాలుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. వెనువెంటనే వెళ్లి చెక్కు పంపిణీ చేసి వచ్చా రు. గుంటూరులో వీధికుక్కల సంతతి పెరగకుండా ఉండేందుకు చర్యలు తీసు కుంటున్నామని కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రకటించారు. ఈ ఏడాది డిసెంబ రు నాటికి వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తి చేస్తామని అధికారులు ప్రకటించారు.

ఆరోగ్యకర అలవాట్లతో వ్యాధుల నుంచి రక్షణ

● కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవశర్మ వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చిన్న నాటి నుంచే చక్కటి ఆరోగ్య అలవాట్లు అలవర్చుకుంటే 80 శాతం వ్యాధులను నివారించవచ్చని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ రాఘవశర్మ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హస్పిటల్స్‌లో సోమవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడా రు. యుక్త వయస్సులో చెడు అలవాట్లకు దూరంగా ఉం డటం, నిత్య వ్యాయా మం, ప్రతి సంవత్సరం బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యం పరిరక్షించుకోవచ్చని డాక్టర్ రాఘవశర్మ తెలిపారు. న్యూరో సర్జన్ డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండని యువకులకు తల్లిదండ్రులు బైక్ లు ఇవ్వవద్దని సూచించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ 40 ఏళ్ల వయస్సుకు పైబడిన వారు ప్రతి ఏటా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గుండె జబ్బులు, పక్షవాతం, కిడ్నీ, లివర్, కేన్స ర్ వంటి సమస్యలను త్వరగా గుర్తిస్తే మెరుగైన చికిత్సలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు శివరామకృష్ణ, శరవణకుమార్, చంద్రహాస్, నఫీజ్, ఎన్‌జీ మోహనార్జున్, అయ్యప్ప, శ్రీనివాస్, వినయ్‌కుమార్, రాజేష్, సుష్మ తదితరులు ప్రసంగించారు. రోగులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవశర్మ, ఇతర వైద్యులు

విజ్ఞానయాత్రలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తాయి

● డీఈవో సీవీ రేణుక

గుంటూరు (విద్య) ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఆధ్వర్యం లో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సోమవారం నిర్వహించిన విజ్ఞాన విహారయాత్రను ఉదయం స్టాల్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి డీఈవో సీవీ రేణుక పచ్చజెండా ఊపి ఈ యాత్రను ప్రారం భించారు. జిల్లా వ్యాప్తంగా 100 మంది విద్యార్థులు, 20 మంది గైడ్ టీచర్లు ఈ యాత్రలో పాల్గొన్నారు. డీఈవో సీవీ రేణుక మాట్లాడుతూ విజ్ఞాన విహారయాత్రలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీస్తా య ని విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రలను సద్వినియోగం చేసుకోవాల ని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీలక్ష్మి విద్యార్థులతో కలిసి పల్నాడు జిల్లాలోని కొండవీడు కోటను సందర్శించారు. కార్యక్రమంలో డీవైఈ వో జి.ఏసురత్నం, డీసీఈబీ సెక్రటరీ తిరుమలేష్, ఉర్దూ డీఐ ఖాసీం, జీసీడీవో సుజాత, జగదీష్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ జేసీ కళాశాలలో '23' మూవీ యూనిట్ సందడి

గుంటూరు (విద్య) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీ ఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ 23 సినిమా యూనిట్ సభ్యులు సందడి సోమ వారం చేశారు. మల్లేశం అనే తన తొలి చిత్రంతో ఘన విజయం నమోదు చేసుకొని జాతీయ అవార్డు దక్కించుకున్న ప్రముఖ దర్శకులు రాజ్ రాచకొండ ఆధ్వర్యంలో నూతన కథానాయకుడు రాయపాటి తేజ, నూతన కథానాయకి తన్మయి తారాగణంతో నూతనంగా నిర్మించిన '23' సినిమా యూనిట్ ప్రచార కార్యక్రమంలో భాగంగా కళాశాలను సందర్శించింది. సోమవారం చిత్ర హీరో హీరోయిన్‌లు విద్యార్థులతో కలిసి నృత్యం చేశారు. చిత్రం విజయం సాధించా లని కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రాయపాటి గోపాలకృష్ణ ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హీరో రాయపాటి తేజ

మిర్చి వ్యాపారి కుటుంబం నుంచి డబ్బులు ఇప్పించండి

● ఐజికి బాధిత రైతుల ఫిర్యాదు

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తమ వద్ద మిర్చి కొనుగోలు చేసిన వ్యాపారి మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబం నుంచి తమకు రావా ల్సిన డబ్బు తమకు ఇప్పించాలని పలువురు బాధిత రైతులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. పెదకాకాని మండలం, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కిలారు రాజా రమేష్, అప్పసాని చంద్రశేఖర్ నుంచి 32 క్వింటాళ్ల మిర్చిని గుంటూరు జేకేసీ కాలేజ్ రోడ్‌లోని భవానీ ట్రేడింగ్ కంపెనీ యజమాని పాములపాటి భవానీ ప్రసాద్ కొనుగోలు చేశారు. మిర్చికి సంబంధించిన మొ త్తాన్ని మూడు నెలల్లోపు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దురదృష్టవశాత్తు భవాని ప్రసాద్ గత ఏడాది జూన్ 12న మరణించారన్నారు. ఆయన భార్య అరుణ, కుమారులు శివరాం, సుదీప్ లను వారి నివాసంలో కలుసుకుని చెల్లింపు గురిం చి అడిగామన్నారు. మొదట వారు నగదు చెల్లింస్తామని మాటిచ్చి తర్వాత డబ్బులు ఇవ్వకుండా అడుగుతుంటే బెదిరిస్తున్నారన్నారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదన్నారు. ఓ ఎస్ఐ నిందితులకు మద్దతుగా ఉన్నారన్నారు.

వైభవంగా కోదండరాముడి పల్లకి ఊరేగింపు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్ శ్రీకోదండ రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్స వాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం కోదండరాముడి పల్లకి ఊరేగింపు వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాట ప్రదర్శన మధ్య నగర వీధుల్లో ఊరే గింపు వేడుకగా కొనసాగింది. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు కొమ్మినేని కోటేశ్వరరావు(బాబు), ఉపాధ్యక్షుడు కే ఆదినారాయణ, కోశాధికారి కే ప్రసాద్, కమిటీ సభ్యులు కే కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పీ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

క్రికెట్ బెట్టింగ్స్‌పై కఠిన చర్యలు

క్రికెట్ బెట్టింగ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్ డిఎస్పీ అరవింద్ హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేఖరులతో మా ట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్స్‌కు పాల్పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చ రించారు. ఐపీఎల్‌ను దృష్టిలో ఉంచుకుని వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని హోట ల్స్, లాడ్జిలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. బెట్టింగ్స్‌కు పాల్పడుతున్నట్లు పోలీసుల దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా x లఖ్‌నవూ — మ.3.30 నుంచి — వేదిక: కోల్‌కతా

పంజాబ్ x చెన్నై — రా.7.30 నుంచి — వేదిక: చండీగఢ్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
గుజరాత్	4	3	1	0	6	1.031
బెంగళూరు	4	3	1	0	6	1.015
పంజాబ్	3	2	1	0	4	0.074
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	4	1	3	0	2	-0.891
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఆర్‌సీబీ.. హమ్మయ్య



- ఆఖరి ఓవర్‌లో అద్భుతం
- విరాట్, రజత్ హాఫ్ సెంచరీలు
- పోరాడి ఓడిన ముంబై
- రాణించిన తిలక్

ముంబై: ఐపీఎల్ అభిమానులకిది అదిరిపోయే మ్యాచ్. బ్యాటింగ్‌లో చెలరేగిన బెంగళూరు ప్రత్యర్థి ముంబై ముందు 222 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచినా.. ఆఖరి బంతి వరకూ ఉత్కంఠను రేకెత్తించింది. ఓ దశలో ముంబై ఓటమి లాంఛనమే అనిపించినా తిలక్ వర్మ (29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 56), హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 42)ల దంచుడు ఆర్‌సీబీలో గుబులు రేపింది. కానీ కీలక దశలో వారి వికెట్లు తీసి తిరిగి పోటీలోకి రావడంతో పాటు, చివరి ఓవర్‌లో స్పిన్నర్ క్రునాల్ (4/45) మూడు వికెట్లు పడగొట్టి ఆర్‌సీబీని గట్టెక్కించాడు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రజత్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే వాంఖడేలో ఈ జట్టు పదేళ్ల తర్వాత గెలవడం మరో విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 221 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 67), దేవ్‌దత్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37), రజత్ పటీదార్ (32 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 64), జితేశ్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 40 నాటౌట్) చెలరేగారు. హార్దిక్, బౌల్ట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసి ఓడింది. హాజెల్‌వుడ్, యష్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రజత్ పటీదార్ నిలిచాడు.

చివర్లో బోల్తా: భారీ ఛేదనలో ముంబై ఆరంభం నుంచే ఇబ్బంది పడింది. ఆర్‌సీబీ బౌలర్లు కట్టడి చేయడంతో ఓపెనర్లు రోహిత్ (17), రికెల్టన్ (17) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అటు విల్ జాక్స్ (22)తో కలిసి సూర్యకుమార్ (28) మూడో వికెట్‌కు 41 పరుగులు జోడించి ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే సూర్య భారీ షాట్లు ఆడేందుకు కష్టపడ్డాడు. రెండు క్యాచ్ అవుట్స్ ప్రమాదం నుంచి తప్పించుకున్న తను చివరకు 12వ ఓవర్‌లో యష్‌కు చిక్కాడు. అప్పటికి స్కోరు 99/4గా ఉండడంతో ఇక ముంబైకి భారీ ఓటమి ఖాయమనిపించింది. కానీ ఈ దశలో తిలక్, హార్దిక్ బ్యాట్లు ఝుళిపించి వణుకు పుట్టించారు. 13వ ఓవర్‌లో తిలక్ 6,4,4.. 14వ ఓవర్‌లో హార్దిక్ 6,4,6,4తో 39 పరుగులు రావడంతో మ్యాచ్ ముంబై వైపు తిరిగింది. అలాగే తిలక్ 16వ ఓవర్‌లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ అంతా సవ్యంగా సాగుతున్న దశలో ముంబై వరుస ఓవర్లలో ఈ ఇద్దరి వికెట్లను కోల్పోయింది. సమీకరణం 6 బంతుల్లో 19 రన్స్‌కి చేరింది. అయితే క్రునాల్ ఆరు పరుగులే ఇచ్చి శాంట్నర్ (8), చాహర్ (0), నమన్ (11)ల వికెట్లు తీసి ఆర్‌సీబీని సంబరాల్లో ముంచాడు.

ఆరంభం నుంచే దంచుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ జట్టు స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఓపెనర్ విరాట్ అనూహ్యంగా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగగా, దేవ్‌దత్, కెప్టెన్ రజత్, జితేశ్ కూడా అదరగొట్టడంతో బెంగళూరు భారీ స్కోరందుకుంది. చివరి ఐదు ఓవర్లలో జట్టు 70 పరుగులు సాధించింది. బుమ్రా ఒక్కడే కాస్త కట్టడి చేశాడు. అయితే తొలి ఓవర్ రెండో బంతికే ఓపెనర్ సాల్ట్ (4)ను పేసర్ బౌల్ట్ బౌల్డ్ చేసినా.. జట్టు ఆటలో మాత్రం జోరు తగ్గలేదు. ముంబైపై బెంగళూరు తమ అత్యధిక పవర్‌ప్లే స్కోరు (73/1)ను సాధించింది. పడిక్కళ్‌ను స్పిన్నర్ విఘ్నేష్ అవుట్ చేసి రెండో వికెట్‌కు 52 బంతుల్లోనే 91 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పెట్టాడు. అనంతరం 10-13 ఓవర్ల మధ్య పరుగులు నెమ్మదించాయి. అయితే శాంట్నర్ ఓవర్‌లో 20 పరుగులు రావడంతో తిరిగి లయ అందుకుంది. తర్వాతి ఓవర్‌లోనే విరాట్, లివింగ్‌స్టోన్ (0)లను హార్దిక్ అవుట్ చేశాడు. కానీ డెత్ ఓవర్లలో పటీదార్‌కు జితేశ్ జత కలవడంతో ముంబై బౌలర్లు గతి తప్పారు. 16వ ఓవర్‌లో జితేశ్ 4,6 రజత్ 4తో బౌల్ట్ 18 రన్స్ సమర్పించుకున్నాడు. ఇక ఆ తర్వాత పటీదార్ 6,6,4తో 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. హార్దిక్ వేసిన ఈ 17వ ఓవర్‌లో ఏకంగా 23 రన్స్ వచ్చాయి. 19వ ఓవర్‌లో జితేశ్ రెండు సిక్సర్లతో స్కోరు 200 దాటగా రజత్ వికెట్‌ను కోల్పోయింది. వీరి మధ్య ఐదో వికెట్‌కు 69 పరుగులు జత చేరాయి. చివరి ఓవర్‌లో బుమ్రా 8 పరుగులే ఇచ్చి కాస్త ఊరటనిచ్చాడు.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (బి) బౌల్ట్ 4; విరాట్ (సి) నమన్ (బి) హార్దిక్ 67; పడిక్కళ్ (సి) జాక్స్ (బి) విఘ్నేష్ 37; పటీదార్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 64; లివింగ్‌స్టోన్ (సి) బుమ్రా (బి) హార్దిక్ 0; జితేశ్ (నాటౌట్) 40; డేవిడ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 221/5. వికెట్ల పతనం:** 1-4, 2-95, 3-143, 4-144, 5-213; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-57-2; దీపక్ 2-0-29-0; బుమ్రా 4-0-29-0; జాక్స్ 1-0-10-0; శాంట్నర్ 4-0-40-0; హార్దిక్ 4-0-45-2; విఘ్నేష్ 1-0-10-1.

ముంబై: రోహిత్ (బి) యశ్ దయాల్ 17, రికెల్టన్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 17, విల్ జాక్స్ (సి) కోహ్లీ (బి) క్రునాల్ 22, సూర్యకుమార్ (సి) లివింగ్‌స్టోన్ (బి) యశ్ దయాల్ 28, తిలక్ వర్మ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 56, హార్దిక్ (సి) లివింగ్‌స్టోన్ (బి) హాజెల్‌వుడ్ 42, నమన్ ధిర్ (సి)యశ్ దయాల్ (బి) క్రునాల్ 11, శాంట్నర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 8, దీపక్ చాహర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 0, బౌల్ట్ (నాటౌట్) 1, బుమ్రా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు 7 ; మొత్తం 20 ఓవర్లలో 209/9 ; వికెట్లపతనం :** 1-21, 2-38, 3-79, 4-99, 5-188, 6-194, 7-203, 8-203, 9/209 ; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-48-1, యశ్ దయాల్ 4-0-46-2, హాజెల్‌వుడ్ 4-0-37-2, సుయాష్ శర్మ 4-0-32-0, క్రునాల్ 4-0-45-4.



నాన్నంటే.. ఎంతో భయం!

న్యూఢిల్లీ: చిన్నప్పుడు తనకు నాన్న పాన్ సింగ్ అంటే ఎంతో భయమనే విషయాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో మహేంద్ర సింగ్ ధోనీ బయటపెట్టాడు. ఆయన వల్లే ఎంతో క్రమశిక్షణతో కూడిన జీవితం అలవాటైందని తెలిపాడు. తన కెరీర్‌ను తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పాడు. 'నాన్న ఎంతో కఠినంగా ఉండేవారు. కానీ, ఎన్నడూ కోప్పడలేదు. ఎప్పుడూ సమయపాలన పాటించేవారు. అది నాకు కూడా అలవడింద'ని తెలిపాడు. తన తండ్రి వల్లే జీవితంలో ఎప్పుడూ అభద్రతా భావానికి గురికాలేదన్నాడు.



మనోళ్లు మురిపిస్తారా?

బరిలో సింధు, సేన్, ప్రణయ్

నేటినుంచి బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్

నిన్‌గ్బో (చైనా): ఇటీవలి కాలంలో జరిగిన అన్ని ప్రధాన టోర్నీలలో భారత షట్లర్లు తీవ్రంగా నిరాశ పరిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇక్కడ ప్రారంభమయ్యే ప్రతిష్ఠాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మనోళ్లు ఎలా రాణిస్తారోనన్న ఉత్కంఠ ఏర్పడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, మాళవిక బన్సోడ్, అనుపమా ఉపాధ్యాయ, ఆకర్షి కశ్యప్ తలపడుతున్నారు. మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ ద్వయం, పురుషుల్లో సాత్విక్/చిరాగ్ జంట టోర్నమెంట్‌లో పాల్గొనడంలేదు. తొలి రౌండ్‌లో తైపీకి చెందిన లీ చియాతో లక్ష్యసేన్ తలపడతాడు. గువాంగ్ జు (చైనా)తో ప్రణయ్, కంటపాన్ (ఇండోనేసియా)తో రజావత్, క్వాలిఫయర్‌తో కిరణ్ జార్జ్ మొదటి రౌండ్‌లో అమీతుమీ తేల్చుకుంటారు. మహిళల సింగిల్స్‌లో..ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు-ఎస్తేర్ నురుమి (ఇండోనేసియా)తో టోర్నీని ప్రారంభిస్తుంది. ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ ఇంటనాన్‌ను అనుపమ, చైనా షట్లర్ ఫాంగ్‌ను మాళవిక, రెండో సీడ్ యా హాన్ (చైనా)ను ఆకర్షి ఢీకొంటారు. మహిళల డబుల్స్‌లో ప్రియ/శ్రుతి జంట-తైపీ జోడీ యున్ సంగ్/చీన్ యుతో తలపడతారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ కుమార్, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్/రుత్వికా శివాని, సతీష్ కరుణాకరన్/ఆద్య, ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

2019 తర్వాత టీ20ల్లో తన ఫాస్టెస్ట్ (29 బంతుల్లో) హాఫ్ సెంచరీ చేసిన విరాట్ కోహ్లీ. అలాగే ఈ ఫార్మాట్‌లో 13 వేల రన్స్ పూర్తి చేసిన ఐదో బ్యాటర్ అయ్యాడు.

1 ఐపీఎల్‌లో ఎక్కువ వికెట్లు (184) తీసిన పేసర్‌గా భువనేశ్వర్. బ్రావో (183)ను అధిగమించాడు.

2 వాంఖడేలో ఆర్‌సీబీకిది రెండో అత్యధిక స్కోరు (221/5). 2015లో 235/1 రన్స్ చేసింది.

నర్మదకు ఆరో స్థానం

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో సోమవారం భారత షూటర్లు నిరాశపర్చారు. సోమవారం జరిగిన మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో నర్మద నితిన్ 166.3 పాయింట్లతో ఆరో స్థానంలో, సోనమ్ ఉత్తమ్ 124.4 పాయింట్లతో ఎనిమిది స్థానంలో నిలిచారు. జిఫి వాంగ్ (చైనా) స్వర్ణం నెగ్గగా.. యుంజీ కవ్వాన్ (కొరియా) రజతం, ఆడ్రే గొగ్నియాత్ (స్విట్జర్లాండ్) కాంస్యం దక్కించుకొన్నారు. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో నర్మద ఆరో స్థానం, సోనమ్ తొమ్మిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించారు.



ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్‌గా బ్రూక్

లండన్: ఇంగ్లండ్‌క్రికెట్ పరిమిత ఓవర్ల ఫార్మాట్లకు ఇక నుంచి హ్యారీ బ్రూక్ సారథ్యం వహించనున్నాడు. ఈ మేరకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అధికారిక ప్రకటన చేసింది. చాంపియన్స్ ట్రోఫీలో జట్టు పేలవ ప్రదర్శన కారణంగా జోస్ బట్లర్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈనేపథ్యంలో వైస్ కెప్టెన్‌గా ఉన్న 26 ఏళ్ల బ్రూక్‌కు వన్డే, టీ20 జట్ల పగ్గాలు అప్పగించారు. టెస్టు కెప్టెన్ స్టోక్స్‌కే పరిమిత ఓవర్ల కెప్టెన్సీని అప్పగిస్తారనే కామెంట్స్ వినిపించినా.. ఈసీబీ బ్రూక్ వైపు మొగ్గు చూపింది. 2022లో అరంగేట్రం చేసిన బ్రూక్ ఇంగ్లండ్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ ఆడుతున్నాడు.

ఇషాంత్‌కు జరిమానా

హైదరాబాద్: గుజరాత్ టైటాన్స్ పేసర్ ఇషాంత్ శర్మ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించారు. అంతేకాకుండా ఓ డీమెరిట్ పాయింట్ కూడా అతడి ఖాతాలో చేరింది. ఆదివారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇషాంత్ ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ 2.2 రూల్‌ను అతిక్రమించినట్టు తేలింది. క్రికెట్ సామగ్రి, జెర్సీ, మైదానంలోని వస్తువులను అగౌరవపర్చడం దీనికిందికి వస్తుంది. రెఫరీ శ్రీనాథ్ విధించిన ఈ జరిమానాను ఇషాంత్ అంగీకరించాడు.

టాంజానియా చరిత్ర

తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత



న్యూఢిల్లీ: ఆఫ్రికా క్రికెట్ జట్టు టాంజానియా చరిత్ర సృష్టించింది. తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించింది. నైజీరియాలో జరిగిన అండర్-19 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో ఆరు జట్ల రౌండ్ రాబిన్ లీగ్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ టాంజానియా విజయాలు సాధించింది. ఈ క్రమంలో 2026లో జరిగే జూనియర్ వరల్డ్ కప్‌నకు అర్హత సాధించిన 12వ జట్టుగా టాంజానియా నిలిచింది. 16 జట్ల టోర్నీలో ఆతిథ్య జట్టుగా జింబాబ్వేతోపాటు గత టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేసిన 10 జట్లు నేరుగా క్వాలిఫై అయ్యాయి. ఆసియా, ఈస్ట్ ఆసియా పసిఫిక్, ఐరోపా, అమెరికా రీజియన్ల నుంచి ఒక్కో జట్టు అర్హత సాధించాల్సి ఉంది.

గుట్టుగా వ్యాధుల విస్తరణ

- లక్షణాలు లేకుండా పెరుగుతున్న జబ్బులు
- దీర్ఘకాల వ్యాధులతో జీవిస్తున్న లక్షలాది మంది
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న బీపీ, షుగర్, ఫ్యాటీలివర్
- అపోలో 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు.. పైకి ఏ లక్షణమూ కనిపించదు! లోలోపలే శరీరానికి తీరని నష్టం చేస్తుంది!! మధుమేహం.. అధికంగా దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం వంటి లక్షణాలున్నా చాలామంది పట్టించుకోరు!! ఈ రెండింటికీ తోడు.. ఇటీవలికాలంలో బాగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్!! పరీక్ష చేస్తే కానీ బయటపడని ఈ జీవనశైలి రుగ్మతలు తమకు ఉన్నాయన్న విషయం కూడా తెలియకుండానే దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాలం గడిపేస్తున్నట్టు అపోలో ఆస్పత్రి సోమవారం విడుదల చేసిన 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న అపోలో ఆస్పత్రుల్లో 25 లక్షలమందికిపైగా వ్యక్తులకు చేసిన ఆరోగ్య పరీక్షల ఆధారంగా రూపొందించిన నివేదిక ఇది.

దేశవ్యాప్త గణాంకాలు..

దేశవ్యాప్తంగా 4.5 లక్షల మందికి బీపీ పరీక్ష చేయగా.. వారిలో 26% మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. 23% మంది మధుమేహంతో, 65 శాతం మంది ఫ్యాటీలివర్‌తో, 46 శాతం మంది అథెరోస్క్లెరోసిస్ (రక్తనాళాల్లో కాల్షియం పేరుకుపోయే) సమస్యతో బాధపడుతున్నట్టు అపోలో నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా.. ఫ్యాటీలివర్ బారిన పడినవారిలో 85 శాతం మందికి అసలు మద్యపానం అలవాటే లేదని.. అథెరోస్క్లెరోసిస్ బాధితుల్లో 2.5 శాతం మంది 40 ఏళ్లలోపువారే కావడం ఆందోళనకరమని నివేదిక పేర్కొంది. అలాగే.. రుతుక్రమం ఆగిపోయిన తర్వాత మహిళలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్టు నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. అపోలో పరీక్షలు చేసినవారిలో మెనోపాజ్‌కు ముందు మధుమేహం బారిన పడినవారు 14% ఉంటే.. మెనోపాజ్ తర్వాత ఆ సంఖ్య 40 శాతానికి చేరిందని పేర్కొంది. బాలల్లోనూ, యువతలోనూ పెరుగుతున్న ఊబకాయంపై ఆ నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాథమిక పాఠశాలల పిల్లల్లో 8 శాతం మంది, కాలేజీ విద్యార్థులు 28 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నట్టు వెల్లడించింది. మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. యువతలో 19 శాతం మందిలో ముందస్తు రక్తపోటు (ప్రీహైపర్‌టెన్షన్) సమస్య కనిపించడం. పౌష్టికాహార లోపం, శారీరక శ్రమ లేకపోవడం, యువతలో ఒత్తిడి పెరిగిపోవడం ఈ సమస్యకు కారణంగా భావిస్తున్నారు. ఇక.. దేశవ్యాప్తంగా 53 వేల మందికి నిద్ర రుగ్మతలకు సంబంధించిన పరీక్షలు చేయగా వారిలో 24 శాతం మంది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఏప్నియాతో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. రక్తహీనత సమస్యతో 45% మంది మహిళలు, 26% మంది పురుషులు బాధపడుతుండగా.. విటమిన్ డి లోపం స్త్రీ, పురుషుల్లో వరుసగా 77%, 82 శాతంగా ఉంది. విటమిన్ బి12 లోపం 38 శాతం మంది పురుషులు, 27 శాతం మంది మహిళల్లో ఉన్నట్టు తేలింది. 40 ఏళ్లలోపు వారిలో ఈ లోపం మరింత స్పష్టంగా కనిపించింది. బి12 లోపం ఉన్నవారు వైద్యులను సంప్రదించి, దాన్ని సరిచేసుకోకపోతే.. పలు ఆరోగ్యసమస్యల బారినపడే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. అదే సమయంలో.. ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకుని అనారోగ్య సమస్యలను గుర్తించి, వైద్యుల సలహా సూచనలను పాటించిన 59 శాతం మందిలో హెచ్‌బీఏ1సీ (గడిచిన 2-3 నెలల సగటు షుగర్ లెవల్స్) స్థాయిలు తగ్గాయని, 51 శాతం మందికి అధిక రక్తపోటు స్థాయిలు తగ్గాయని నివేదికలో తేలింది.

ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై దృష్టిపెట్టాలి

బీపీ, షుగర్, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలున్నా.. వాటి లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలా మంది వైద్యపరీక్షలు చేయించుకోవట్లేదని, అలా కాకుండా ముందుగా పరీక్షలు చేయించుకుంటే వీటిలో చాలా జబ్బులు వచ్చే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని నివేదిక సూచించింది. నివేదికలోని అంశాలపై అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ప్రివెంటివ్ హెల్త్‌కేర్ అంటే భవిష్యత్‌లో నిర్ణయం తీసుకునే అంశం కాదని, ప్రస్తుతం దేశ శ్రేయస్సుకు అదే మూలస్తంభం అని ఆయన అభిప్రాయపడ్డారు. మద్యం సేవించకపోయినా ఫ్యాటీ లివర్ వ్యాధి రావడం.. కొత్త రోగనిర్ధారణ పరీక్షల అవసరాన్ని తెలియజేస్తోందని, సంప్రదాయ స్క్రీనింగ్ పరీక్షలు ఇక ఎంతమాత్రం సరిపోవని అపోలో ఆస్పత్రుల ఎండీ సునీతా రెడ్డి అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



శక్తిమంతమైన లుక్‌లో...

అశ్విన్‌బాబు హీరోగా ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అభినయ, రియా సుమన్, ఆయేషా ఖాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి అశ్విన్‌బాబు లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో ఆయన పాత్ర శక్తిమంతంగా ఉన్నట్లు తెలుస్తోంది. మెడికల్ యాక్షన్ మిస్టరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఎం.ఆర్.వర్మ, డీఓపీ: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌరహరి.

గోదారి అందాల నడుమ..



విక్టరీ వెంకటేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో 'గోదారి గట్టుపైన' పాట ఎంత పాపులర్ అయిందో చెప్పనక్కర్లేదు. ఆ పాటలోని మొదటి పదాన్ని తమ సినిమాకు టైటిల్‌గా నిర్ణయించింది రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ. 'గోదారి గట్టు పైన' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. సుభాష్‌చంద్ర దర్శకుడు. నిధి ప్రదీప్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ఒక చల్లని సాయంత్రం వేళ ప్రశాంతమైన గోదావరి ఒడ్డున మీ స్నేహితులతో కూర్చుని సమయం గడపడం ఎంత ప్రశాంతంగా ఉంటుందో.. మా సినిమా కూడా అంతే ప్రశాంతంగా ఉంటుంది. అందమైన భావోద్వేగాలతో ఉంటుంది. గోదావరి జిల్లాలు వేల్పూరు, రేలంగి, భీమవరం నేపథ్యంలో రూపుదిద్దుకుంటోంది. పశ్చిమ గోదావరి ప్రాంతంలోని సుందరమైన ప్రకృతి దృశ్యాలు ప్రేక్షకులకు కనువిందు చేస్తాయి' అని దర్శకుడు చెప్పారు. రాజీవ్ కనకాల, లైలా, దేవీ ప్రసాద్, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కాసిరెడ్డి, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అభినవ్ రావు ఈ చిత్రానికి నిర్మాత.



ముచ్చటగా బంధాలే!

విజయశాంతి, కల్యాణ్‌రామ్ తల్లీకొడుకులుగా నటిస్తున్న 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' చిత్రం ఈ నెల 18న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో వీరిద్దరి పాత్రలు చాలా కీలకం. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ సింగిల్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. సెకండ్ సింగిల్ 'ముచ్చటగా బంధాలే' ను బుధవారం చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో విడుదల చేయనున్నారు. తల్లీకొడుకుల అనుబంధాన్ని అద్భుతంగా వివరించే పాట ఇది. ఇటీవలె సినిమా ప్రమోషన్స్ ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా చేసిన స్పెషల్ ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్ని అందించారు. రామ్‌ప్రసాద్ ఛాయాగ్రాహకుడు.



షారుఖ్‌తో మళ్లీ..

షారుఖ్ ఖాన్ కొత్త చిత్రం 'కింగ్' గురించి వినిపిస్తున్న ఒక కొత్త వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. షారుఖ్, ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రలు పోషించే ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రను దీపిక పదుకోన్ పోషించనున్నారట. ఇందులో ప్రత్యేకత ఏముంది అంటారా.. సుహానాకు ఆమెకు తల్లిగా నటించడం ప్రత్యేకతేగా మరి. షారుఖ్, దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఆ పాత్ర ప్రాధాన్యం గురించి దీపికకు చెప్పి ఆమెను ఒప్పించారట. షారుఖ్ చిత్రంలో దీపిక మళ్లీ నటిస్తున్నందుకు ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు కానీ ఇందులో ఆమెది తల్లి పాత్ర అని తెలియగానే నీరస పడిపోతున్నారు. ఎందుకంటే.. 'దీపికకు 39 ఏళ్లు, సుహానాకు 24 ఏళ్లు. వీరిద్దరికి పదిహేనేళ్ల ఏజ్ గ్యాపే ఉంది కనుక తల్లీకూతుళ్లుగా కంటే అక్కా చెల్లెళ్లుగా చూపిస్తే బాగుంటుంది.. ఆలోచించండి ఖాన్ సాబ్' అని అభిమానులు అభ్యర్థిస్తున్నారట.



ఎక్స్‌లోకి రీ ఎంట్రీ

నటి సమంత సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లోకి రీఎంట్రీ ఇచ్చారు. ఈ సందర్భంగా తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' టీజర్‌ను అభిమానులతో పంచుకున్నారు. 'పెద్ద కలలతో మా టీమ్ చేసిన చిన్ని ప్రయత్నమిది.. ఎంతో ప్రేమతో చేసిన ఈ చిత్రాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్ర టీజర్ ఇటీవలే విడుదలైంది. త్వరలోనే రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా, 2012లో ఎక్స్(అప్పట్లో ట్విట్టర్) ఖాతాను ప్రారంభించారు సమంత. ఇటీవలె అందులో పెట్టిన అన్ని పోస్టులను తొలగించారు. అప్పటినుంచి ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్, వ్యక్తిగత విషయాలు, ఫొటోలు షేర్ చేస్తున్నారు. ఇప్పుడీ చిత్రాన్ని ప్రమోట్ చేయడానికి ఆమె ఎక్స్ ఖాతాను తిరిగి ఉపయోగించడంతో నెటిజన్లు ఖుషీ అవుతున్నారు. ఆమెను స్వాగతిస్తూ పోస్టులు పెడుతున్నారు.

ఏకే వస్తున్నాడు..



తమిళ హీరో అజిత్‌కుమార్ నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. త్రిష కృష్ణన్ కథానాయికగా నటించారు. షాయాజీ షిండే, జాకీ ష్రాఫ్, ప్రభు, సునీల్, అర్జున్‌దాస్, సిమ్రాన్, ప్రియాప్రకాశ్ వారియర్ కీలక పాత్రలు పోషించారు. ఈనెల 10న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నువ్వు పెద్ద విలన్‌వని విన్నా.. కానీ నా గేమ్‌లో నేనేరా నీకు విలన్', 'ఏకే వస్తున్నాడు దారివదలండ్రా', 'వాడు భయాన్ని భయపెట్టేవాడు' వంటి సంభాషణలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి.

రెండో సారి క్యాన్సర్... భార్యకు ధైర్యం చెప్పిన హీరో



బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా సతీమణి, నటి, దర్శకురాలు తహీరా కశ్యప్ రెండోసారి క్యాన్సర్ బారిన పడ్డారు. తనకు తిరిగి రొమ్ము క్యాన్సర్ సోకినట్టు ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఎటువంటి అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు వెళ్లాలని తహీరా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తహీరా తన రొమ్ము క్యాన్సర్ విషయం వెల్లడించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలని కోరారు. భార్య పెట్టిన పోస్ట్‌కు వెంటనే స్పందిస్తూ 'మై హీరో' అని కామెంట్ పెట్టారు. 2018 లో ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. ఇక అప్పటినుంచి చికిత్సలో భాగంగా జరిగే ప్రతి చర్యనీ ఆమె సోషల్ మీడియాలో పంచుకుంటూ తనలా క్యాన్సర్‌తో బాధ పడేవారికి ధైర్యాన్ని ఇచ్చారు.

క్వింటాల్ రూ.12,611 పలికిన పసుపుధర

దుగ్గిరాల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కమిటీ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 502 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,900, గరిష్ఠ దర రూ.12,611, మోడల్‌ధర రూ.12,325 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,2002, గరిష్ఠధర రూ. 12,516, మోడల్‌ధర రూ. 12,311 పలికాయి.

కిట్లు ఉంచిన గదులు పరిశీలన

పెదనందిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అందించే కిట్లను భద్రపరిచిన గదులను సోమవారం సమగ్ర శిక్షా రాష్ట్రస్థాయి పరిశీలకులు కె.జీవనజ్యోతి పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం నాడే పాఠ్య, నోట్ పుస్తకాలు, కిట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బ్యాగులు, బూట్లు ఇప్పటికే మండలాలకు చేరుకున్నాయి. వాటిని ఎలా భద్రపరిచారు, పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఆమె వెంట జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి దార్ల అనిల్, ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు, హెచ్ఎం లక్ష్మీదుర్గా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21 తేదీలలో ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్టు వాటిని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణంలోని చిట్యాల ఐలమ్మ రజకకళ్యాణ మండపం స్థలం వద్ద మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. భాస్కరయ్య మాట్లాడుతూ 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కొండపల్లి పోస్టాఫీస్ సెంటర్ నుండి ప్రదర్శన అనంతరం వీటీపీఎస్ బి కాలనీ గ్రౌండ్ వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభలో పలువురు ఎమ్మెల్యేలు, రాష్ట్ర రజక సంఘం నేతలు పాల్గొంటారన్నారు. మహాసభల సందర్భంగా పలు హామీలు అమలు చేయాలని, కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వర రావు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా సుబ్బారావు, నేతలు పాగోలు శ్రీనివాసరావు, యానాదిరావు, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం



లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు , పాల్గొన్న నాయకులు

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్లకు పట్టాభిషేకం చేసిన మంత్రి లోకేశ్‌కు ఉండవల్లి ప్రజలు సోమవారం అభినందనలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నారా లోకేశ్ పట్టాలు పంపిణీ చేసే సభా ప్రాంగణానికి బస్సులు బయలుదేరే దేవుని మాన్యం గ్రౌండ్ వద్ద టిడిపి నేత గాదె వినయ్ మాట్లాడుతూ ఉండవల్లి ప్రజల తరపున మంత్రి లోకేశ్‌కు ధన్యావాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బసివిరెడ్డి, గాదె శ్రీనివాసరావు, వినయ్, దాసరి కృష్ణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

టీడీపీ గ్రామ అధ్యక్షుడిపై దాడి

● తలకు బలమైన గాయాలు

దుగ్గిరాల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శృంగారపురంలో స్థలాలకు మధ్య దారి గొడవలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు యలవర్తి అంకమ్మరావుపై దాడికి పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూడేళ్లుగా ఇళ్ల వద్ద దారి గొడవకు సంబంధించి తరచూ వాగ్వాదాలు జరుగు తుండేవి. కాగా ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో యలవర్తి అంకమయ్యతో పొరుగున ఉన్న ఘంటసాల నాగ మల్లేశ్వరరావు, భార్య కృష్ణకుమారి, కుమారులు గణేశ్, శివసాయిలు గొడవకు దిగారు. పరస్పర వాగ్వాదం చివరకు కర్రలతో దాడికి దారితీసింది. దాడిలో అంకమయ్య తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఎన్నారై వైద్యశాలకు తరలించారు. ఎన్నారై నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

● డీఎస్పీ మురళీకృష్ణ

తుళ్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లకు తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ మురళీకృష్ణ సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వారికి హెచ్చరికలు జారీచేశారు. మీపై పోలీసుల నిఘా నిరంతర ఉంటుందని హెచ్చరించారు. నడవడిక మార్చుకుంటే సమాజంలో విలువల తో ఉంటారని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యమంలో సీఐ అంజియ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జొన్న, మొక్కజొన్న, పసుపునకు నష్టపరిహారం ఇవ్వాలి

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జొన్నా శివశంకర్ మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న, పెసర, అపరాలు, ప్రకటించిన మద్దతు ధరలు రాక ప్రైవేటు వ్యాపారులకు తక్కువ రేట్లకు అమ్ముకుని రైతులు మోసపోతున్నారన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి అధికారులు తూట్లు

● ప్రజాసమస్యల పరిష్కారవేదికకు పలువురు అధికారులు డుమ్మా
● 25 శాఖలకు 9మందే హాజరు
● ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
● జిల్లా కార్యాలయాల బాటపడుతున్న అర్జీదారులు



గ్రీవెన్స్‌లో పాల్గొన్న 9మంది అధికారులు

పెదనందిపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10గంటలకు అధికారులు హాజరై ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని 12గంటల నుంచి ఆయా గ్రామాల ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించి వాటికి పరిష్కారానికి నిర్దేశిత సమయాన్ని కేటాయిస్తూ తగు రశీదును ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అధికారులు మొక్కుబడిగా హాజరవడంతో వచ్చిన అర్జీలు తీసుకొని పరిష్కారించాల్సి ఉండగా కేవలం అవి డెస్క్‌లకే పరిమితమవుతున్నాయి. మరలా తిరిగి అర్జీలను సమర్పించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రీసర్వేలో చేసిన తప్పిదాలపై అర్జీలు పెట్టినప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదంటూ రైతులు వాపోతున్నారు. ఇక్కడి అధికారులు స్పందించకపోవడంతో జిల్లా కార్యాలయాలకు వెళ్లి అర్జీలు ఇవ్వాల్సి వస్తుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ముఖ్యమంత్రి ప్రజాదర్బార్ నెలలో ఒక బుధవారం ప్రజాసమస్యలు పరిష్కారం కోసం అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇవేమి తమకు పట్టవన్నట్లు ఇక్కడి మండలస్థాయి అధికారులు ప్రతివారం ఇదే తంతు కొనసాగిస్తున్నారు. దీనికి ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపమే కారణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ బుక్స్ స్టాక్ పాయింట్లలో తనిఖీ



ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలలో గదులను పరిశీలిస్తున్న సర్వశిక్ష రాష్ట్ర పరిశీలకురాలు జీవనజ్యోతి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభం రోజుకే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోటు బుక్స్, యూనీఫామ్, బూట్లు, బ్యాగ్ తదితర వస్తువులు అందించేందుకు ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న స్టాక్ పాయింట్లను సర్వశిక్ష రాష్ట్ర పరిశీలకురాలు జీవనజ్యోతి తనిఖీ చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర 1 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పాఠశాలల ప్రారంభానికి ముందే అన్ని మండలాలకు పుస్తకాలను పంపించనుంది. అయితే వచ్చే స్టాక్ భద్రపరిచేందుకు అవసరమైన నన్ని గదులు అందుబాటులో ఉన్నాయా లేవా.. తెలుసుకునేందుకు జీవనజ్యోతి ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో మొత్తం ఎనిమిది గదులను స్టాక్ పాయింట్ కింద ఎంపిక చేశారు. ఈ గదులను ప్రత్తిపాడు ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, జీ లీలారాణిలు చూపించారు. క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె వచ్చిన మెటీరియల్‌ను జాగ్రత్త పరచడంతో పాటు సకాలంలో అన్ని పాఠశాలలకు చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● మంగళగిరి సిటీ, (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ఆరంభంలో విద్యార్థులకు పంపిణీ చేయనున్న పుస్తకాలు, యూనిఫారం, ఇతర సామగ్రి స్టాక్ పాయింట్‌ను మంగళగిరి డాన్‌బోస్కో పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర స్థాయి సమగ్ర శిక్ష పరిశీలకురాలు జీవనజ్యోతి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజే విద్యార్థులకు అవసరమైన అన్ని సామగ్రిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ దార్ల అనిల్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

● కాకుమాను, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, షూలు, మూడు జతల ఏకరూప దుస్తులు, బ్యాగ్‌లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర స్థాయి పరిశీలకురాలు జీవనజ్యోతి అన్నారు. కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ దార్ల అనీల్, ఎంఈవో కెన్నడీ, సీఆర్పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ఇస్రో యూవికా యంగ్ సైంటిస్టు'కు ముట్లూరు విద్యార్థులు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇస్రో యూవికా యంగ్ సైన్‌టిస్టు ప్రోగ్రాం 2025కు ఎంపికైన ముట్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి చందు పవన్‌దుర్గాతో పాటు గుంటూరు డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి సోమ శేఖర్‌లు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా ఇస్రో నిర్వహించే యువికా యంగ్ సైన్‌టిస్టు ప్రోగ్రాంకు ఎంపికైనట్టు ముట్లూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం జోష్ మేరి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు వీఎస్ రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ముట్లూరు జెడ్పీ విద్యార్థి చందు పవన్ దుర్గకు గైడ్ టీచర్‌గా వ్యవహరిస్తున్న రామాంజనేయులు గుంటూరు కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి సోమశేఖర్ గైడ్ టీచర్ రామాంజనేయులు కుమారుడు కావటం విశేషం. జిల్లా స్థాయి నుంచి ఈ ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్టు వెల్లడించారు. జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లా విద్యార్థులు మే 18వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు శ్రీహరికోట షార్ కేంద్రంలో జరిగే యునిక యంగ్ సైన్‌టిస్టు ప్రోగ్రాంలో పాల్గొంటారు. జిల్లా నుంచి ముట్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి చందు పవన్ దుర్గ, కేఆర్ గౌతమ్ స్కూల్ నుంచి సోమశేఖర్‌లు ఎంపిక కావటం పట్ల జిల్లా డీఈవో రేణుక డీఎస్‌వో గౌస్‌మీర ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అలాగే ఇప్పటి వరకు ముట్లూరు జెడ్పీ హైస్కూల్ నుంచి ఇస్రో ప్రోగ్రాంలకు పది మంది విద్యార్థులు ఎంపిక కావటం పాఠశాలకు గర్వకారణమని హెచ్ఎం జోష్ మేరీ హర్షం వ్యక్తం చేశారు.

స్థలం కబ్జా చేసేందుకు మా ఇళ్లు కూల్పించాడు

● ఎస్పీని ఆశ్రయించిన బాధిత మహిళలు



ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మేము విక్రయించిన స్థలం పక్కన ఖాళీ స్థలంలో ఇల్లు వేసుకుని నివాసం ఉంటుంటే వైసీపీ నాయకుడు పోలీసులు, మున్సిపల్ అధికా రులతో కలిసి తమ ఇళ్ళు కూల్పించి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని వెంగళాయపాలెం గ్రామానికి చెందిన షేక్ అమీనా, హజరత్ వలి, షేక్ గౌసియా, షేక్ హసీనా తదితరులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమకు వెంగళాయపాలెం పరిధిలో 66 సెంట్లు రిజిస్టర్డ్ పొలం ఉందన్నారు. దానిని 2006లో జయ మనోహర్‌రెడ్డికి విక్రయించామ న్నారు. ఎప్పటినుంచో మా పొలం పక్కనే ఉన్న 15 సెంట్లు పోరంబోకు స్థలంలో తాము గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నామన్నారు. వైసీపీ నాయకుడైన ఎంపీపీ అనేకసార్లు తమను ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరించాడన్నారు. తాము నిరాకరించడంతో పోలీసులు మున్సిపల్ అధికారులతో కుమ్మక్కై తమ గుడిసెలను పీకించేశాడన్నారు. తాము అమ్మిన పొలంతో పాటు పక్కనే ఉన్న పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకొని అందులో రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తున్నారని బాధితులు ఎస్పీ కార్యాలయంలో వచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాణిక్యంకు పలువురు నేతల నివాళి



మాణిక్యం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మంగళగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం యర్రబాలెంకు చెందిన టీడీపీ నేత ఆకుల ఉమామహేశ్వరరావు మాతృమూర్తి, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య అత్తయ్య స్వర్గీయ ఆకుల మాణిక్యం సంస్మరణ కార్యక్రమం సోమవారం జరిగింది. టీడీపీ నేతలతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై మాణిక్యం చిత్రపటానికి నివాళులు అర్పించారు. మంగళగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, నేతలు మాదల రమేష్‌బాబు, కొత్తపల్లి శ్రీనివాసరావు, సుఖమంచి గిరిబాబు, మునగపాటి మారుతీరావు, గోవాడ దుర్గారావు, అన్నే చంద్రశేఖర్, విన్నకోట శ్రీనివాసరావు, మల్లాది శ్రీనివాస్, ఆళ్ల శ్రీనివాసరావు, రంగిశెట్టి పెద్దబ్బాయ్, గాజుల శ్రీనివాసరావు, జంజనం సాంబశివరావు, చిన్ని తిరుపతయ్య, సైదా నాయక్ తదితరులు హాజరయ్యారు.

పారిశుధ్య కార్మికులకు నెల నెలా జీతాలు చెల్లించాలి

తాడేపల్లి (గుండిమెడ), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో పని చేసే పారిశుధ్య కార్మికులకు నెల నెలా జీతాలు చెల్లించాలని సీఐటియూ తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో పారిశుధ్య కార్మికులను కలిసి వారి పెండింగ్ జీతాల సమస్యపై సంఘీభావ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విలీన గ్రామాల్లో పనిచేసే కార్మికులకు రూ.21వేలు చెల్లించాలని కోరారు.

నల్లపాడు చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధి, 27వ డివిజన్ నల్లపాడు చెరువు వాగు పోరంబోకు ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు షకూర్, ప్రఖ్యాతా, అంబేద్కర్‌లు సోమవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. జీఎంసీ నుంచి 2.70 ఎకరాలను అనుమతి పొంది, దాదాపు 5 ఎకరాలను ఆక్రమించి శాలిని డెవలపర్ సంస్థ వారు వెంచర్లు వేసి విక్రయిస్తున్నారని తెలిపారు. నీటి ప్రవాహం ఎక్కువైనప్పుడు ఈ స్థలం నుంచి నీరు బయటకు వెళుతుందని, కానీ ఆ స్థలం ఆక్రమణలకు గురైందని తెలిపారు. దీంతో నల్లపాడు ఎస్సీకాలనీ, హౌసింగ్ బోర్డ్ ప్రాంతాలకు నీరు భారీగా చేరుతుందని వివరించారు. ఆక్రమణదారులకు నగరపాలక సంస్థ అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణలు తొలగించి ఆ స్థలాన్ని చెరువులో కలపాలని కోరారు.

కనులపండువలా సీతారాముల దివ్య రథోత్సవం



యనమదలలో జరుగుతున్న సీతారాముల స్వామి రథోత్సవం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రెండో భద్రాద్రిగా పేరొందిన యనమదల శ్రీసీతారామస్వామి వారి దివ్య రథోత్సవం వేలాది మంది భక్తుల నడుమ కనులపండువలా జరిగింది. సీతారాముల కల్యాణం మరుసటి రోజు స్వామి రథోత్సవం నిర్వహించడం ఎన్నో వందల సంవత్సరాలుగా ఆనవాయితీ. ఇదే రీతిలో యనమదల సీతారాముల స్వామి దేవాలయం వద్ద దివ్య రథోత్సవాన్ని నిర్వహించారు. అంతే గాకుండా రథోత్సవంతో పాటు తిరునాళ్ల కూడా ఇక్కడ జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

మెరక తోలేందుకు అనుమతి ఇవ్వాలి

● పూర్వపు విద్యార్థి సంఘ నాయకుల వినతి

పెదనందిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మెరక తోలేందుకు మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వాలంటూ డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఎంఈవో ముద్దన శ్రీనివాసరావులకు సోమవారం పాఠశాల పూర్వపు విద్యార్థి సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఆ భవనాన్ని కూల్చివేసి, మట్టితోలి మెరకలు వేసి, నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు కోసం సర్వశిక్షా అభియాన్‌కు దరఖాస్తు చేశామని, స్వర్ణాంధ్ర 2024 సీఎస్ఆర్ నిధులు ఇచ్చేందుకు దాతలు కూడా ముందుక వచ్చారని తెలిపారు. ఈ మేరకు మెరక తోలేందుకు అనుమతులు ఇవ్వాలని పూర్వపు విద్యార్థిసంఘ నాయకులు కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం, నాయకులు పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ చూపాలి



పేరుకలపూడి వైద్యశిబిరంలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

పెదనందిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ చూపాలని మండల వైద్యాధికారి టి.కమలాకరరావు అన్నారు. మండలపరిధిలోని పెదనందిపాడు, అబ్బినేనిగుంటపాలెం పీఏసీఎస్ సొసైటీల వద్ద ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 225 మంది రైతులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ దాసరి శ్రీనివాసరావు, సీఈవోలు మదమంచి శ్రీనివాసరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

● అబ్దుల్ రెహ్మాన్

ఫిరంగిపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలని ఫిరంగిపురం ఎంపీహెచ్ఎస్ అబ్దుల్ రెహ్మాన్ అన్నారు. సోమవారం ఫిరంగిపురంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లా డారు. సొసైటీలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్డులో మానసిక ఆరోగ్యం, రక్తహీనత, శిశు మరణాలు, మాతృ మరణాలు సంభవించకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో భాస్కర్, మల్లికార్జున, రమణ, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

దుగ్గిరాల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భం గా దుగ్గిరాలలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకరమైన ప్రారంభం.. ఆశాజనక మైన భవిష్యత్తు అంటూ నినాదాలు చేస్తూ సోమవారం గ్రామవీధుల్లో ర్యాలీ కొనసాగించారు. అనంతరం పెదపాలెం, పెనుమూలి, ఈమని గ్రామాల్లో ఉచిత వైద్యపరీక్ష శిబిరాలను నిర్వహించారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో గడిపే జీవితంతో కలిగే లాభాల గురించి ప్రజలకు తెలియజేశారు. డాక్టర్ ఇజాజ్ అహ్మద్, హెల్త్‌ఎడ్యుకేటర్ వీ సుబ్బారావు, సూపర్‌వైజర్ లలితకు మారి, సీహెచ్ఎస్ జానమ్మ తదితరులు పాల్గొన్నారు. వైద్యశిబిరాలకు వచ్చి న పలువురికి రక్తపరీక్షలు నిర్వహించారు.

మన మంగళగిరి 2.0 పుస్తకావిష్కరణ



మన మంగళగిరి 2.0 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మన మంగళగిరి 2.0 పుస్తకాన్ని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం ఆవిష్కరించా రు. మంగళగిరి పట్టణానికి చెందిన రచయిత, న్యాయవాది మాదిరాజు గోవర్ధనరావు కొమ్మారెడ్డి సేవాస మితి ఆధ్వర్యంలో ఈ పుస్త కాన్ని రచించారు. ఈ కార్య క్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, కొమ్మారెడ్డి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మారెడ్డి సుబ్రహ్మణ్యం (నాని), రచయిత మాదిరాజు గోవర్ధనరావు, కొమ్మారెడ్డి రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ నిర్వహణకు స్థల పరిశీలన

● పొన్నెకల్లులో 14న అంబేద్కర్ జయంతి వేడుకలు
● స్థలాన్ని పరిశీలించిన జేసీ భార్గవ్‌తేజ



సీఎం సభ నిర్వహణకు స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ భార్గవ్‌తేజ, టీడీపీ నాయకులు

తాడికొండ(పొన్నెకల్లు)ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఈనెల 14న నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీఎం నారాచంద్రబాబు నాయుడు పాల్గొననున్నారని సమాచారం. సోమవారం ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ సీఎం సభ నిర్వహణకు సబంధించి స్థలాన్ని పరిశీలించారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించేందుకు సభా స్థలాన్ని పరిశీలించారు. సీఎం సభ స్థలాన్ని పరిశీలించిన వారిలో గుంటూరు ఆర్‌డీవో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు గుంటుపల్లి మధుసూదనరావు, యడ్లపల్లి సాంబశివరావు, పీ రమేష్, తహసీల్దార్ మెహర్ కుమార్, ఆర్.ఐ హనుమంతరావు, సీఐ కే.వాసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఏపీఎంపై కలెక్టర్‌కు ఫిర్యాదులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఏపీఎం లాజరు వ్యవహారశైలిపై మండలంలోని రెండు గ్రామాల నుంచి కలెక్టర్‌కు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రత్తిపాడుకు చెందిన ప్రత్తిపాడు గ్రామైఖ్య సంఘం, గొట్టిపాడు గ్రామానికి చెందిన రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘం సభ్యులు ఈ ఫిర్యాదులు చేశారు. గొట్టిపాడు రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘం వీవోఏ తొలగింపు, కొత్త వీవోఏ నియామకం విషయంలో ఇప్పటికే రోడ్డెక్కి రచ్చ జరిగింది. ఈ క్రమంలో గ్రామ సంఘం ప్రమేయం లేకుండా తమ సంఘంలో లేని వ్యక్తిని వీవోఏగా నియమించారని, అప్పటి నుంచి గ్రూపులో ఇబ్బందులు ఏర్పడ్డాయని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. మా సంఘంలోని 20 గ్రూపులకు ఎలాంటి లోన్లు ఇవ్వకుండా ఏపీ ఎం ఆపివేస్తున్నారన్నారు. అలాగే వీవోఏని తొలగించిన తీర్మానం, కొత్తగా ఎన్నుకున్న మన్న తీర్మానాలు తమకు ఇప్పించాలంటూ వారు కలెక్టర్‌ను కోరారు. అలాగే ప్రత్తిపాడు గ్రామైఖ్య సంఘం కూడా తమకు తెలియకుండానే తమ వీవోను తొలగించారని, తమ ప్రమేయం లేకుండానే కొత్త వీవోను ఎన్నుకున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఏపీఎం తీరుతో మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అంతే కాకుండా తప్పుడు కేసులు పెడుతున్నారని, శాఖాపరంగా విచారణ చేసి ఏపీఎంపై చర్యలు తీసుకోవాలంటూ ఇరు సంఘాలకు చెందిన మహిళలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆరోగ్యకర అలవాట్లతో వ్యాధుల నుంచి రక్షణ

● కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవశర్మ వెల్లడి



వేదికపై కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవ శర్మ తదితరులు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చిన్న నాటి నుంచే చక్కటి ఆరోగ్య అలవాట్లు అలవర్చుకుంటే 80 శాతం వ్యాధులను నివారించవచ్చని ప్రముఖ కార్డియాజిస్ట్ డాక్టర్ వీవీ రాఘవశర్మ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో సోమవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యుక్త వయస్సులో చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, నిత్య వ్యాయామం, ప్రతి సంవత్సరం బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యం పరిరక్షించుకోవచ్చని డాక్టర్ రాఘవశర్మ తెలిపారు. న్యూరో సర్జన్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని యువకులకు తల్లిదండ్రులు బైక్‌లు ఇవ్వవద్దని సూచించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ 40ఏళ్ల వయస్సుకు పైబడిన వారు ప్రతి ఏటా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గుండె జబ్బులు, పక్షవాతం, కిడ్నీ, లివర్, కేన్సర్ వంటి సమస్యలను త్వరగా గుర్తిస్తే మెరుగైన చికిత్సలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు శివరామకృష్ణ, శరవణకుమార్, చంద్రహాస్, నఫీజ్, ఎన్‌జీ మోహనార్జున్, అయ్యప్ప, శ్రీనివాస్ వినయ్‌కుమార్, రాజేష్, సుష్మ తదితరులు ప్రసంగించారు. రోగులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.

లోకేశ్ స్ఫూర్తితో తోపుడు బండ్లు పంపిణీ



వడ్డమానులో తోపుడు బండ్లను చిరువ్యాపారులకు అందజేస్తున్న టీడీపీ నాయకులు

తుళ్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని వడ్డమాను గ్రామంలో సోమవారం టీడీపీ నేతలు చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్‌కుమార్ మంత్రి లోకేశ్ స్ఫూర్తితో ఇప్పటి వరకు దాదాపు 140 తోపుడు బండ్ల వివిధ గ్రామాల్లో అందజేయటం జరిగింది. వడ్డమానులో తోపుడు బండి, టిఫిన్ బండి, ఇస్త్రీకి అనుకూలంగా ఉన్న బండిని కిరణ్ కుమార్, నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమం టీడీపీ గ్రామ అధ్యక్షుడు పుచ్చకాయల గిరిబాబు, తెలుగురైతు మండల అధ్యక్షుడు చిలుకూరి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు పిన్నక సాంబశివరావు, పిన్నక అప్పారావు, జమ్ముల అనిల్, భీమన బుజ్జీ, పుచ్చకాయల సాంబశివరావు,సాంబశివారెడ్డి, కామాల కృష్ణారావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పారిశుధ్య పనులను పరిశీలించిన మునిసిపల్ చైర్‌పర్సన్

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డ్రైయిన్లలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శానిటేషన్ అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని 24వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు 12 అర్జీలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12దరఖాస్తులు అందాయి. రెవెన్యూ 4, పంచాయతీరాజ్ 2, సీనియర్ సిటిజన్స్ 2, హెల్త్, బీసీ వెల్ఫేర్, హౌసింగ్, మునిసిపల్ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందజేశారు. దరఖాస్తులను ఆయా శాఖలకు పంపి పరిష్కరింపజేస్తామని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పురపాలక సంఘానికి 4...

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి రెండు, ఇంజనీరింగ్ సెక్షన్‌కి రెండు, అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు ఫిర్యాదులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ సోమవారం తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలకు 3 ఇరిగేషన్ సమస్య పరిష్కారం కోసం 1 ఫిర్యాదు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీ అడిషనల్ కంట్రోలర్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకారం

పెదకాకాని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరీక్ష భవనంలో అడిషనల్ కంట్రోలర్‌గా వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాద్, బీఎస్సీ సెక్షన్, బీఏ సెక్షన్, బీకాం సెక్షన్‌లలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాఫ్ట్‌వేర్ టీసీఎస్‌కు ఏఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 11మంది ఎంపికయ్యారని కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఆ సంస్థ విద్యార్థులకు నేషనల్ క్వాలిఫై టెస్టు, ఇంటర్వ్యూ నిర్వహించి రూ.2.40లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక చేసిందన్నారు. తమ కళాశాలలో మెరుగైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలు సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ రాంచంద్ పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుపై 5శాతం రాయితీ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 30వ తేదీలోపు ముందస్తు ఆస్తిపన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ కల్పిస్తామని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు సోమవారం తెలిపారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఖాళీ స్థలం, ఆస్తి పన్ను చెల్లించేవారు ఏప్రిల్ 30లోగా ముందస్తుగా చెల్లిస్తే పన్నులో 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు.

వక్ఫ్ బిల్లును రద్దు చేయాలి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలకు ఇబ్బందులు కలిగించే వక్ఫ్‌బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ ముగ్బుల్‌బేగ్ డిమాండ్ చేశారు. సోమవారం వక్ఫ్ బిల్లు రద్దు కోరుతూ అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అఖిలపక్ష ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో పట్టణంలో ఐలాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ జియావుల్‌హక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పఠాన్ అహ్మద్ ఖాన్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ మహ్మద్, షేక్ బాజీ, ఎండీ మునీర్, పఠాన్ ఫైజుల్లా ఖాన్, షేక్ సుభాని, జానీ బేగ్, ఫజరుల్లా, బాజీ సాహెబ్, రషీద్ పాల్గొన్నారు.

మాతంగి దురాచార కరపత్రాల ఆవిష్కరణ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మాతంగి దురాచారాల నిర్మూలనకు పోరాటం సాగిద్దామని కుల నిర్మూలను పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మానవహక్కుల వేదిక కార్యాలయంలో మాతంగి దురాచార నిర్మూలన పోరాటకరపత్రాలను ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మ తిరునాళ్లలో మాతంగి చిందులు వేసే ప్రదర్శనలను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ టి.రాజారావు, బలగాని వెంకటేశ్వర్లు, తోడేటి శ్రీనివాస్, మన్నెం కిశోర్, భేతాళం ప్రకాశరావు, రాజేంద్ర, కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు ఎప్పటికో..?

- పెరిగిన ఉష్ణతాపం
- దాహార్తితో అల్లాడుతున్న ప్రజలు
- తక్షణ చర్యలకు ప్రజల డిమాండ్



ఎండలో నడిచి వెళ్తున్న వృద్ధురాలు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత పెరగటంతో ప్రజలు దాహార్తితో ఇబ్బంది పడుతున్నారు. ఏప్రిల్ నెల వచ్చినా ఇంకా ప్రభుత్వం ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటుచేయకపోవటంపై పలువురు విమర్శిస్తున్నారు. తెనాలి పట్టణం వర్తక వాణిజ్య వ్యాపార కేంద్రం కావటంతో నిత్యం పట్టణానికి పరిసర గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వేలాదిగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పెరిగిన ఎండలకు ఆయా ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. చలివేంద్రాలను ఎప్పటికి ఏర్పాటు చేస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క ఎండ తాపం మరోపక్క ఉక్కపోతతో ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు నీటిని కొనుగోలు చేస్తున్నారు. పేదలు కొనుగోలు చేయలేక అక్కడక్కడ ఉన్న చేతి పంపుల వద్ద మంచి నీరు తాగుతూ దాహార్తిని తీర్చుకుంటున్నారు. వారం క్రితం మార్కెట్ ప్రాంతంలో ఓ వృద్ధురాలు సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చి ఎండ తాపానికి సొమ్మసిల్లి పడిపోయింది. గమనించిన స్థానికులు కూల్‌డ్రింక్ షాపులో తాగునీరు తెచ్చి సపర్యలు చేసి తిరిగి పూర్వస్థితికి తీసుకువచ్చారు. దప్పికగా ఉన్నా నడుచుకుంటూ రావడంతో స్పృహతప్పి పడిపోయినట్లు ఆమె తెలిపింది.

పురపాలక సంఘంలో మూలనపడిన ఆర్వో ప్లాంటు

పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలోని తాగునీరు అందించే ఆర్వో ప్లాంట్ గత కొన్ని నెలల క్రితం మరమ్మతులకు గురయింది. దీనిని ఇంతవరకు అధికారులు మరమ్మతులు చేయించలేదు. నిత్యం వందలాది మంది ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకొనేందుకు మునిసిపల్ కార్యాలయంకు వచ్చి తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్వో ప్లాంట్ పనిచేయక పోవడంతో బయట షాపులలో నగదు చెల్లించి తాగునీరు కొనుక్కోవలసిన దుస్థితి. అంతేకాకుండా నిత్యం వందల మంది వచ్చే తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోను తాగునీరు అందుబాటులో ఉండటం లేదు. అత్యవసర విభాగం వద్ద ఉన్న చేతిపంపు నీరు మురికిగా రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని మునిసిపల్, జిల్లా ప్రభుత్వ వైద్యశాల అధికారులు తక్షణమే స్పందించి చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. గతంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాల కాంట్రాక్టర్లు బిల్లు చేసుకోవడానికి మినహా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడలేదన్న ఆరోపణలు కూడా పలువురి నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఒక ఏడాది మునిసిపల్ అధికారులే సిబ్బందిని నియమించి పలు ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటుచేసినా నిర్వహణ లోపంతో ప్రజల దాహం తీరలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అటువంటి పొరపాట్లకు తావులేకుండా పట్టణంలో పలుప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటుచేసి సక్రమంగా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.



మునిసిపల్ కార్యాలయంలో పనిచేయని ఆర్వోప్లాంట్, దాతలు ఏర్పాటుచేసిన కూలర్

ఘనంగా శ్రీసీతారామ పాదుకా పట్టాభిషేకం



బోసు రోడ్డులో, అంగలకుదురు ఆశ్రమంలో పాదుకా పట్టాభిషేకం పూజలు నిర్వహిస్తున్న పండితులు, మారీసుపేటలో గ్రామోత్సవం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీసీతారాముల పాదుక పట్టాభిషేకం శ్రీరామ నవమి వేదికల వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో పట్టాభిషేకం కార్యక్రమం అనంతరం శ్రీసీతారామ చంద్రుల వారిని అలంకరించిన రథంపై ఉంచి పట్టణంలో ఊరేగించారు. కమిటీ కార్యదర్శి కేవీ సూర్యనారాయణమూర్తి, విద్యాధర్, రవి శాస్త్రి, నరసింహాచార్యులు పర్యవేక్షించారు. మెట్ట పార్థసారథిశర్మ యాగ్నికులుగా వ్యవహరించారు. గాడిబావి సెంటర్‌లోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో శేష వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం జరిపారు. అలంకరించిన రథంపై ప్రధాన రహదారి, బోసురోడ్డులో ఊరేగించారు. చల్లా బాలత్రిపురసుందరి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఈవో అమర్‌నాథ్, అర్చకులు గురునాథశాస్త్రి పర్యవేక్షించారు. శ్రీసీతారామ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో హనుమాన్‌చౌక్‌లో ప్రసాదాలు పంపిణీ చేశారు. అంగలకుదురు దాసకోటి ఆశ్రమంలో సీతారాముల పట్టాభిషేకం, ప్రత్యేక పూజలను పట్టాభి సీతారామదాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. మారీసుపేట అప్పలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి గ్రామోత్సవం జరిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం

● రూరల్ ఎస్‌ఐ ఆనంద్

తెనాలిరూరల్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు తొలిప్రాధాన్యం ఇస్తానని రూరల్ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన కట్టా ఆనంద్ చెప్పారు. గతంలో పల్నాడు ప్రాంతంలో, చేబ్రోలు స్టేషన్‌లో ఎస్‌ఐగా, మంగళగిరి పరిధిలో సీఐడీలో పనిచేసిన ఆనంద్ సాధారణ బదిలీల్లో భాగంగా సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ జిల్లా కార్యాలయానికి రిపోర్ట్ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ ఆనంద్‌ను స్టేషన్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

● తహసీల్దార్‌కు శివసాంబిరెడ్డి వినతి

తెనాలిరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన జొన్న, మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ములక శివసాంబిరెడ్డి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న పంటలు సాగు పూర్తయి చేతికి వచ్చాయన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తమ పంట ఉత్పత్తులను ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్ముకొని నష్టపోతున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులను ఆశ్రయించి ఎకరాకు రూ.25 వేలు నష్టానికి విక్రయించే పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

తెనాలిరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పీవీ రాంబాబు నెక్ బీడీసీ షటిల్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. విజేతలకు బహుమతులను నిర్వాహకులు వినయ్‌కుమార్, కె.జార్జ్‌థామస్ అందజేశారు. కార్యక్రమంలో నర్రిశెట్టి మహేష్, బీవీఆర్ పీటర్‌పాల్, సతీష్, పి.ధీరజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

సచివాలయంలో ఎంపీడీవో తనిఖీ

కొల్లిపర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సచివాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దావులూరు, తూములూరు, కొల్లిపర సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. సచివాయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన తప్పని సరిగా పాటించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అలకనంద, మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

కావు కొట్లలో కమిషనర్ తనిఖీలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అరటి, పండ్ల వర్తకులు దుకాణాలు, కావు కొట్లను మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పండ్ల వర్తకులు పండ్లను పండించడానికి వినియోగించే పదార్థాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల వర్తకులు కావు వేయడానికి ప్రమాదకర రసాయనాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండ్ల వర్తకులు కృత్రిమంగా కార్బోహైడ్రేట్‌లు వినియోగిస్తే ప్రజలు అనారోగ్యం బారిన పడతారని హెచ్చరించారు. సహజ సిద్ధంగా పండించే పండ్లను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు.



అరటికాయ కావు కొట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు



అవగాహన సదస్సులో పాల్గొన్న కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవ శర్మ తదితరులు

ఆరోగ్యకర అలవాట్లతో వ్యాధుల నుంచి రక్షణ

● కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవశర్మ వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చిన్న నాటి నుంచే చక్కటి ఆరోగ్య అలవాట్లు అలవర్చుకుంటే 80శాతం వ్యాధులను నివారించవచ్చని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ రాఘవశర్మ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో సోమవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యుక్త వయస్సులో చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, నిత్య వ్యాయామం, ప్రతి సంవత్సరం బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యం పరిరక్షించుకోవచ్చని డాక్టర్ రాఘవశర్మ తెలిపారు. న్యూరో సర్జన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్, వైద్యులు శివరామకృష్ణ, శరవణకుమార్, చంద్రహాస్, నఫీజ్, ఎన్‌జీ మోహనార్జున్, అయ్యప్ప, శ్రీనివాస్ వినయ్‌కుమార్, రాజేష్, సుష్మ తదితరులు ప్రసంగించారు. రోగులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ములుకుదురులోని శ్రీభూనీలా సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం విశ్వక్సేన పూజతో అంకురారోపణ చేయనున్నారు. 9న బలిహరణ, నిత్యహోమం, చలువ చొప్పరంపై గ్రామోత్సం జరగనున్నాయి. 10న పొన్నమానుసేవ, 11న గజవాహనోత్సవం, ఎదురుకోలోత్సవం, కల్యాణ మహోత్సవం, 12న గరుడోత్సవం, రథోత్సవం, 13న వసంతోత్సవం, అన్నప్రసాద వితరణ, 14న పవళింపు సేవ జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 9న వీర బ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర, 16న సత్య హరిశ్చంద నాటిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

పాలిసెట్ పరీక్షలకు ఉచిత శిక్షణ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నికల్ కళాశాల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్ పరీక్షకు పొన్నూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శ్రీరామా మునిసిపల్ కళాశాలలో ప్రతిరోజు ఉదయం 9.30నుంచి 1వరకు జరిగే ఈ శిక్షణ తరగతులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

గ్రామీణ సంక్షేమ సారథులు అంగన్వాడీలు

● వర్సిటీ బడ్జెట్లో నిధుల కేటాయింపు హర్షణీయం

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలు గ్రామీణ సంక్షేమ సారథులు అని పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రశంసించారు. సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సీఎస్‌ఆర్ విభాగంలో పౌష్టిక ఆహారలోపంపై అంగన్వాడీల శిక్షణకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ మాతా శిశువులకు పౌష్టికాహారం అందాలంటే అంగన్వాడీలదే అందులో కీలకపాత్ర అన్నారు. సీఎస్‌ఆర్ సేవలు విస్తృతం చేయాలని సూచించారు. వర్సిటీ బడ్జెట్లో నిధుల కేటాయింపు హర్షణీయమన్నారు. ప్రారంభోత్సవ సభలో సీఎస్‌ఆర్ విభాగం సంచాలకురాలు బి.బబిత విభాగం ఉపోద్ఘాతాన్ని లక్ష్యాలను వివరించారు. ఈ కార్యశాలలో కాకాని మండలంలోని 54 మంది అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. వర్సిటీ వీసీ ఆచార్య గంగాధర రావు, రెక్టార్ ఆచార్య రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పాల్గొన్నారు. ఉపన్యాసకులుగా డాక్టర్ వెంకట రమణమ, ఆచార్య పి.కిరణ్మయి, ఆచార్య కేవీ శాంతిశ్రీ, డాక్టర్ రమణ మూర్తి పాల్గొన్నారు. సమావేశంలో వర్సిటీ దూర విద్య కేంద్ర సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ప్రత్యేక విధుల అధికారి ఆచార్య ఆర్‌వీఎస్‌ఎస్.రవికుమార్, ప్రవేశాల విభాగం సంచాలకులు ఆచార్య పి బ్రహ్మజీ, దూర విద్యా కేంద్ర పరీక్షల సమన్వయకర్త ఆచార్య డి రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశాన వాటికల్లో పారిశుధ్య చర్యలు చేపడతాం

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రానున్న ఈస్టర్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ శ్మశాన వాటికల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను చేపడతామని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. సోమవారం స్థానిక ఐతానగర్‌లోని క్రైస్తవ శ్మశానాన్ని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు శ్మశానంలో చేపట్టాల్సిన పారిశుధ్య పనులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, కౌన్సిలర్లు నాగవేణి, అరుణ తదితరులు

రుణాలను సద్వినియోగం చేసుకోండి

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం వారు అందిస్తున్న రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో అర్హత కలిగిన 1616మంది లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ శేషన్నతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్లు అత్తోట నాగవేణి, మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ బోయపాటి అరుణ, డీఈ సుబ్బారావు, మెప్మా మేనేజర్ విజయకుమారి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మెప్మా సీఎంఎంలు, ఆర్‌పీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక యడ్ల లింగయ్య కాలనీకి చెందిన బుద్దుల వెంకటేష్ మినీలారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు. ఈ క్రమంలో మార్చి నెల 31వ తేదీన లారీ పనికి ఊరు వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. వారం రోజులైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో మినీలారీ యజమానిని అడగా తన వద్దకు పనికి రాలేదని తెలిపాడు. దీనితో తెలిసినవారిని, బంధువులను విచారించినా ఆచూకీ తెలియరాలేదు. దీనిపై భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బుద్దుల వెంకటేష్ (ఫైల్)

తహసీల్దార్ కార్యాలయానికి రెండు అర్జీలు

తెనాలిరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. వాటిలో ఒకటి సర్వేకి రాగా మరొకటి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని అందించినట్లు వెల్లడించారు.



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

సంప్రదాయ పద్ధతులతో లాభసాటి వ్యవసాయం

● ప్రొఫెసర్ సంధ్యారాణి

తెనాలి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే రసాయనాల వాడకం తగ్గించి సంప్రదాయ పద్ధతులను అవలంబించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సంధ్యారాణి చెప్పారు. సోమవారం మండలంలోని కొలకలూరులో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల బాపట్ల విద్యార్థులతో గ్రామీణ అవగాహన కృషి అనుభవ, జాతీయ సేవా పథకం ద్వారా ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో రైతులతో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎలుకల నివారణ, ఇంటి దగ్గరే సంప్రదాయ ఎరువులు తయారుచేసే విధానం వాటి వల్ల పంట భూములకు కలిగే ప్రయోజనాన్ని వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఇంచార్జ్ డాక్టర్ సువర్ణలత పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే స్టాఫ్, పలువురు రైతులు పాల్గొన్నారు.